మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

Circulated to Telangana
Published from Jagitial

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..


ఆదివారం SUNDAY 2-8-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 34 Issue: 34


02 ఆగస్టు 2026 - ఆదివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:59 సూర్యాస్తమయం - సా. 6:45 తిథి చవితి రా. 11:12 వరకు తరువాత పంచమి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం పూర్వాభాద్ర రా. 9:24 వరకు తరువాత ఉత్తరాభాద్ర యోగం అతిగండ రా. 10:24 వరకు కరణం బవ ఉ. 11:12 వరకు బాలవ రా. 11:12 వరకు వర్జ్యం లేదు దుర్ముహూర్తం సా. 5:03 నుండి సా. 5:54 వరకు రాహుకాలం సా. 5:09 నుండి సా. 6:45 వరకు యమగండం మ. 12:22 నుండి మ. 1:58 వరకు గుళికాకాలం మ. 3:33 నుండి సా. 5:09 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:23 నుండి తె. 5:11 వరకు అమృత ఘడియలు మ. 1:19 నుండి మ. 2:58 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:47 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున



# పసిడి 'పంచ్'లు





## కామన్వెల్త్‌తో భారత్‌కు ఒకే రోజు 7 స్వర్ణాలు

### సాక్షి, జాస్మిన్, ప్రీతి, ప్రియ, అరుంధతికి బంగారు పతకాలు

కామన్వెల్త్ గేమ్స్-2026లో భారత మహిళా బాక్సర్లు సంచలనం సృష్టించారు. యూకేలోని గ్లాస్గో వేదికగా శనివారం జరిగిన బాక్సింగ్ ఫైనల్స్‌లో ఏకంగా ఐదు స్వర్ణ పతకాలు సాధించి చరిత్ర సృష్టించారు. సాక్షి (51 కేజీలు), జాస్మిన్ (57 కేజీలు), ప్రీతి (54 కేజీలు), ప్రియ (60 కేజీలు), అరుంధతి చౌదరి (70 కేజీలు) తమ ఫైనల్ బౌట్లలో అద్భుతమైన ప్రదర్శనతో పసిడి పతకాలను ముద్దాడారు. ఈ విజయాలతో అంతర్జాతీయ బాక్సింగ్‌లో భారత్ తిరుగులేని శక్తిగా ఎదుగుతున్న విషయాన్ని మరోసారి చాటిచెప్పారు.

గ్లాసో: శనివారం జరిగిన ఫైనల్స్‌లో భారత బాక్సర్ల జోరు ముందు ప్రత్యర్థులు నిలవలేకపోయారు. 51 కేజీల విభాగంలో సాక్షి చౌదరి, ఇంగ్లండ్‌కు చెందిన రూబీ వైట్‌పై 5-0 ఏకగ్రీవ నిర్ణయంతో ఘనవిజయం సాధించింది. బౌట్ ఆద్యంతం పదునైన ఫుట్‌వర్క్‌తో, కచ్చితమైన పంచ్‌లతో ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. అదేవిధంగా, 57 కేజీల విభాగంలో జాస్మిన్.. నార్తర్న్ ఐర్లాండ్ బాక్సర్ మైఖేలా వాల్ష్‌పై 5-0తో తరువాయి 2 వ పేజీలో...



# లష్కర్ బోనాలకు సర్వం సిద్ధం

### ఉజ్జయిని మహంకాళి జాతరకు ఏర్పాట్లు పూర్తి

### సర్వాంగసుందరంగా ఆలయం ముస్తాబు

సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి (లష్కర్) బోనాల జాతరకు సర్వం సిద్ధమైంది. చారిత్రాత్మక అమ్మవారి ఆలయం విద్యుత్ దీపాలంకరణలు, పూలమాలలతో సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు.

హైదరాబాద్, ఆగస్టు 1 (ఈవార్తలు): ఆలయానికి వచ్చే భక్తులు సులభంగా అమ్మవారిని దర్శించుకునేందుకు వీలుగా 6 క్యూ లైన్లను ఏర్పాటు చేశారు. బోనాలతో వచ్చే మహిళా భక్తుల కోసం 2 క్యూ లైన్లు, సాధారణ దర్శనం కోసం 2 జనరల్ లైన్లు, ప్రముఖులు, వీఐపీల కోసం 2 వీఐపీ లైన్లు అందుబాటులో ఉంటాయి. జాతర ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాలను కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. భక్తుల దాహార్తిని తీర్చేందుకు హైదరాబాద్ జలమండలి ఆధ్వర్యంలో 5 వాటర్ క్యాంపులను ఏర్పాటు చేశారు. అత్యవసర వైద్య సేవల కోసం ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 3 మెడికల్ క్యాంపులను అందుబాటులో ఉంచారు. బోనాల జాతర నేపథ్యంలో సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో రెండు రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయి. వాహనదారులకు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్‌ను తరువాయి 2 వ పేజీలో...



# జెన్ జీ జమానా

### వాట్సాప్ అంకుల్స్‌పై ఇన్‌స్టా పిల్లలు గెలిచారు

### వచ్చే ఎన్నికల్లో జెన్ జీవే 50 శాతం ఓట్లు

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సోషల్ మీడియా వల్లే ప్రభుత్వాల్లో జవాబుదారీతనం పెరిగిందని, సంప్రదాయ మీడియా కంటే డిజిటల్ వేదికలే ఇప్పుడు ప్రజల గొంతుకగా మారాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శనివారం ఆయన హైదరాబాద్‌లో ఓ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. యువతరం సోషల్ మీడియా ద్వారా కొత్త తరహాలో ఉద్యమాలు చేపడుతోందని, రానున్న ఎన్నికల్లో జెన్-జీ ఓటర్ల ప్రభావం కీలకంగా ఉండబోతోందని పేర్కొన్నారు.

హైదరాబాద్, ఆగస్టు 1 (ఈవార్తలు): ఓ కార్యక్రమంలో మాట్లాడిన కేటీఆర్, "వాట్సాప్ అంకుల్స్.. ఇన్‌స్టాగ్రామ్ పిల్లల్లో చివరకు ఎవరు గెలిచారో దేశం చూసింది. జెన్-జీ దెబ్బకు ప్రధాని నరేంద్ర మోదీ కూడా అర్ధరాత్రి ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పెట్టాల్సి వచ్చింది" అంటూ వ్యాఖ్యానించారు. సంప్రదాయ మీడియా ప్రభుత్వాల ప్రభావంలోకి వెళ్లినా, సోషల్ మీడియాను పూర్తిగా నియంత్రించడం సాధ్యం కాలేదని అన్నారు. సోషల్ మీడియా లేకపోయి ఉంటే అనేక ఘటనల్లో బాధితులకు న్యాయం జరిగేది కాదని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో ఓ కేంద్ర మంత్రి కుమారుడిపై మైనర్ బాలికపై అఘాయిత్య ఆరోపణలు వచ్చినప్పుడు ప్రధాన మీడియా వెంటనే స్పందించలేదని, తరువాయి 2 వ పేజీలో...



# 19 నుంచి ఖాకీ దరఖాస్తులు

### సెప్టెంబర్ 9 వరకు ఆన్‌లైన్ అప్లికేషన్లు.. 4 నోటిఫికేషన్లు జారీ

రాష్ట్రవ్యాప్తంగా వివిధ విభాగాల్లో 7,437 పోస్టుల భర్తీకి సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ తేదీలను ప్రభుత్వం ఖరారు చేసింది. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 9 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు.

హైదరాబాద్, ఆగస్టు 1 (ఈవార్తలు): ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) నాలుగు వేర్వేరు నోటిఫికేషన్లను విడుదల చేసింది. పోలీస్ శాఖతో పాటు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్), అగ్నిమాపక, జైళ్ల శాఖల్లోని ఖాళీలను ఈ నోటిఫికేషన్ల ద్వారా భర్తీ చేయనున్నారు. తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,422 |
| వెండి (కిలో): | రూ.2,34,900 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,041 |




# రాష్ట్రాలకు 1,09,019 కోట్లు

### ఏపీకి రూ.4,597 కోట్లు

### భారీగా నిధులు కేటాయించిన కేంద్రం

న్యూఢిల్లీ: రాష్ట్రాల ఆర్థిక స్థితిని మరింత బలపరిచేందుకు మరియు మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కొరత లేకుండా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర పన్నుల వాటా కింద దేశంలోని అన్ని రాష్ట్రాలకు కలిపి ఒక్కసారిగా రూ. 1,09,019 కోట్లను విడుదల చేసింది. సహజంగా ప్రతి నెల ఇచ్చే గడువు (ఆగస్టు 10) కంటే ముందే ఈ అదనపు వాటాను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేయడం విశేషం. దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వాల వద్ద తగినంత నిధుల లభ్యత పెరిగి, అభివృద్ధి ప్రాజెక్టులు మరియు సంక్షేమ తరువాయి 2 వ పేజీలో...



### రూ.200 తగ్గిన కమర్షియల్

# సిలిండర్ ధర

హైదరాబాద్, ఆగస్టు 1 (ఈవార్తలు): 19 కిలోల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరను ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు (ఓఎంసీలు) రూ. 200కుపైగా తగ్గించాయి. తాజా ధరలు శనివారం నుంచి అమల్లోకి వచ్చాయి. అయితే గృహ వినియోగదారులు ఉపయోగించే 14. 2 కిలోల ఎల్పీజీ సిలిండర్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పు చేయలేదు. తాజా సవరణ ప్రకారం ఢిల్లీలో 19 కిలోల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్‌పై రూ. 202, కోల్‌కతాలో రూ. 209 వరకు తగ్గింది. దీంతో తరువాయి 2 వ పేజీలో...


# 11,403 క్లర్క్ ఉద్యోగాలు

### ఐబీపీఎస్ నోటిఫికేషన్ విడుదల

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న 11,403 క్లర్క్ పోస్టులకు సంబంధించిన నోటిఫికేషన్‌ను 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా దేశంలోని 11 ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఈ ఖాళీలను 2027-28 సంవత్సరానికి భర్తీ చేస్తారు.

న్యూఢిల్లీ: దీనిలో తెలంగాణలో 191, ఆంధ్రప్రదేశ్‌లో 186 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులైనవారు అర్హులు. ఈ ఏడాది ఆగస్టు 1 నాటికి అభ్యర్థుల వయస్సు 20 నుంచి 28 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు 5, ఓబీసీలకు 3, దివ్యాంగులకు 10 ఏండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. అభ్యర్థులు ఏదైనా ఒక రాష్ట్రం లేదా కేంద్ర పాలి ప్రాంతానికి మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. వీరు ఆయా ప్రాంతపు స్థానిక భాషలో ప్రావీణ్యం కలిగి తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



చక్కెర లేదా పాలు కలపని బ్లాక్ టీ తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిల నియంత్రణకు ఉపయోగపడవచ్చని తాజా పరిశోధనలు సూచిస్తున్నాయి. బ్లాక్ టీలో ఉండే సహజ యాంటీఆక్సిడెంట్లు ఇన్సులిన్ పనితీరును మెరుగుపరచడంలో, వాపును తగ్గించడంలో సహాయపడవచ్చని శాస్త్రవేత్తలు వెల్లడించారు. బ్లాక్ టీలో థియాఫ్లావిన్స్, థియారుబిజిన్స్ అనే యాంటీఆక్సిడెంట్ సమ్మేళనాలు ఉంటాయి. టీ ఆకులను ప్రాసెస్ చేసే సమయంలో ఇవి ఏర్పడతాయి. ఈ సమ్మేళనాలు శరీరంలో ఇన్సులిన్ సున్నితత్వాన్ని పెంచడంతో పాటు, వాపును తగ్గించడం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడే అవకాశం ఉందని అధ్యయనాలు సూచిస్తున్నాయి.




# ఎల్లుండి నుంచి నీట్ యూజీ కౌన్సెలింగ్

### సెప్టెంబర్ 8 నుంచి తరగతులు ప్రారంభం

### సెలవుల్లోనూ పనిచేయాలని కాలేజీలకు ఆదేశాలు


న్యూఢిల్లీ: నీట్ యూజీ-2026 కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) శనివారం ప్రకటించింది. దీని ప్రకారం, ఆల్ ఇండియా కోటా సీట్ల భర్తీకి ఆగస్టు 4 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల విద్యా సంవత్సరం (అకడమిక్ సెషన్) సెప్టెంబర్ తరువాయి 2 వ పేజీలో...

# చట్టంగా 'యాంటీ పేపర్ లీక్'

### బిల్లుకు రాష్ట్రపతి ఆమోద ముద్ర

న్యూఢిల్లీ: దేశంలో పేపర్ లీకేజీలను అరికట్టేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ అమెండ్‌మెంట్ బిల్లును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం ఆమోదించారు. దీంతో ఇకపై ఈ బిల్లు చట్టంగా అమలులోకి రానుంది. 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) అమెండ్‌మెంట్ బిల్, 2026' పేరుతో రూపొందిన ఈ బిల్లును ఈ వారంలోనే పార్లమెంట్ ఆమోదించింది. అటు లోక్‌సభలో చర్చ అనంతరం ఆమోదం పొందగా, మరుసటి రోజు రాజ్యసభలో కూడా ఆమోదం లభించింది. దీంతో వెంటనే ఈ బిల్లు ఆమోదం కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వద్దకు పంపింది ప్రభుత్వం. ఇటీవల నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా సీజేపీ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన ఆందోళన గురించి తెలిసిందే. ఈ ఉద్యమం నేపథ్యంలో కేంద్రం పేపర్ తరువాయి 2 వ పేజీలో...



# ఈ-20 పెట్రోల్‌పై కేజ్రీవాల్ పోరుబాట

### ఎల్లుండి ప్రధాని నివాసానికి పాదయాత్ర

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, ఈ-20 ఇంధన విధానంపై కేంద్ర ప్రభుత్వంతో ప్రత్యక్ష పోరుకు సిద్ధమయ్యారు. పెట్రోల్ బంకుల్లో వినియోగదారులకు స్వచ్ఛమైన పెట్రోల్, 20 శాతం ఇథనాల్ కలిపిన ఈ-20 పెట్రోల్ మధ్య ఎంచుకునే అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆగస్టు 4వ తేదీన ప్రధాని నివాసానికి పాదయాత్ర చేపట్టనున్నట్లు ప్రకటించారు. శనివారం తరువాయి 2 వ పేజీలో...

# 5.9 కోట్ల ఐటీఆర్ దాఖలు

### చివరి రోజే 40 లక్షల రిటర్నులు



# రాశి ఫలాలు

2.8.2026

మేషం: స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. వృత్తి వ్యాపారాల్లో ఊహించని అవరోధాలు కలుగుతాయి. ఉద్యోగస్తులకు అదనపు పనిభారం ఉంటుంది. నిరుద్యోగుల శ్రమ వృధాగా మిగులుతుంది. ఆర్థికంగా ఆశించిన ఫలితాలు ఉండవు.

వృషభం: చిన్ననాటి మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. స్థిరాస్తి వ్యవహారాలలో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగస్తులకు జీతభత్యాల విషయంలో శుభవార్తలు అందుతాయి. జీవిత భాగస్వామితో దైవ దర్శనాలు చేసుకుంటారు.

మిధునం: ఉద్యోగాలలో మీ పనితీరుతో అందరిని ఆకట్టుకుంటారు. స్నేహితుల సహాయంతో ఋణ సమస్యల నుండి బయటపడతారు. సోదరులతో వివాదాలు పరిష్కారమౌతాయి. వృత్తి వ్యాపారాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు నూతన అవకాశాలు అందుతాయి.

కర్కాటకం: వృత్తి వ్యాపారాలు మరింత నిరుత్సాహ పరుస్తాయి. చేపట్టిన కార్యక్రమాలు మందకొడిగా సాగుతాయి. కుటుంబ వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు చెయ్యడం మంచిది కాదు. ఉద్యోగ వాతావరణం అంతగా అనుకూలించదు. సంతాన ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించాలి.

సింహం: నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. సన్నిహితులతో మాటపట్టింపులు తప్పవు. వృధా ఖర్చుల విషయంలో పునరాలోచన చెయ్యాలి. కుటుంబ సభ్యుల ప్రవర్తన ఆందోళన కలిగిస్తుంది. వృత్తి ఉద్యోగాలలో బాధ్యతలు పెరగటం వలన తగినంత విశ్రాంతి లభించదు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

కన్య: అనుకున్న పనులు అనుకున్న విధంగా పూర్తి చేస్తారు. సమాజంలో గౌరవ మర్యాదాలు పెరుగుతాయి. ఆకస్మిక ధనలాభం కలుగుతుంది. వ్యాపారానికి నూతన పెట్టుబడులు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడి నుండి ఉపశమనం లభిస్తుంది. చాలాకాలంగా వేదిస్తున్న సమస్యలు నుండి బయటపడతారు.

తుల: నేత్ర అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఇతరుల విషయాల్లో జోక్యం చేసుకోవడం మంచిది కాదు. గృహమున కొందరి ప్రవర్తన మానసిక అశాంతి కలిగిస్తుంది. వృత్తి వ్యాపారాలలో లాభాలు అందుకోవడానికి మరింత కష్టపడాలి. ఉద్యోగ విషయాల్లో అధికారూలతో జాగ్రత్తగా వ్యవహారించాలి.

వృశ్చికం: ఆదాయ మార్గలు సంతృప్తి కలిగిస్తాయి. ఇంటాబయట అనుకూల వాతావరణం ఉంటుంది. కుటుంబ సభ్యుల సహకారంతో ముఖ్యమైన కార్యక్రమాలు పూర్తిచేస్తారు. వృత్తి వ్యాపారాలలో నూతన పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగస్తులకు అదనపు బాధ్యతలు ఉన్నపటికీ సమర్థవంతంగా పనులు పూర్తిచేస్తారు.

ధనస్సు: సోదరులతో స్థిరాస్తి వివాదాలు చికాకు పరుస్తాయి. వృత్తి వ్యాపారాలలో మరింత నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. వాహన ప్రయాణాలలో జాగ్రత్త వహించడం మంచిది.

మకరం: ముఖ్యమైన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి వ్యాపారాలు పుంజుకుని మరింత ముందుకు సాగుతాయి. ధన వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. ఉద్యోగస్తులకు అధికారుల అనుగ్రహంతో అనుకూల మార్పులు చోటుచేసుకుంటాయి.

కుంభం: నిరుద్యోగుల కలలు సాకరమౌతాయి.చిన్ననాటి మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. భూ క్రయ విక్రయాలు అనుకూలంగా సాగుతాయి. వ్యాపారాలలో మరింత ఉత్సాహంగా పని చేసి లాభాలు అందుకుంటారు. చేపట్టిన పనులు అప్రయత్నంగా పూర్తవుతాయి.

మీనం: ముఖ్యమైన వ్యవహారాలు వాయిదా వెయ్యడం మంచిది. బంధు మిత్రులతో అకారణ వివాదాలు కలుగుతాయి. నూతన వ్యాపారాలకు పెట్టుబడులు పెట్టే విషయంలో పునరాలోచన చెయ్యడం మంచిది. ఉద్యోగస్తులకు సహోద్యోగులతో మాటపట్టింపులు ఉంటాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి.

# పసిడి 'పంచ్'లు




**మొదటి పేజీ తరువాయి**

పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. 54 కేజీల విభాగంలో ప్రీతి, కెనడా బాక్సర్ ఎస్.ఎస్. డెల్గాడోపై 5-0 తేడాతో గెలవడమే కాకుండా, బౌట్ మధ్యలో ప్రత్యర్థిని నాక్‌డౌన్ చేసి తన సత్తా చాటింది. ఇక 70 కేజీల విభాగంలో అరుంధతి చౌదరి కూడా ఇంగ్లండ్ బాక్సర్ చాంటెల్ రీడ్‌పై 5-0తో సునాయాసంగా గెలిచింది. వీరితో పాటు 60 కేజీల విభాగంలో ప్రియ ఘూంఘస్, కెనడాకు చెందిన మేరీ-బతౌల్ అల్-అహ్మదియాతో హోరాహోరీగా తలపడింది. చివరి వరకు ఉత్కంఠగా సాగిన ఈ పోరులో 4-1 స్ప్లిట్ డిసిషన్‌తో ప్రియ విజేతగా నిలిచింది. తొలి రౌండ్‌లో కాస్త వెనుకబడినప్పటికీ, ఆ తర్వాత పుంజుకుని పదునైన పంచ్‌లతో న్యాయనిర్ణేతలను మెప్పించింది. ఈ అద్భుత విజయాలతో అంతర్జాతీయ వేదికలపై మహిళల బాక్సింగ్‌లో భారత్ తన స్థానాన్ని మరింత పదిలం చేసుకుంది. ఒకే ఈవెంట్‌లో ఐదుగురు మహిళా బాక్సర్లు స్వర్ణాలు గెలవడం భారత క్రీడా చరిత్రలోనే ఒక అరుదైన ఘనత. గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్‌లో భారత పతకాల సంఖ్యను పెంచడంలో బాక్సింగ్ బృందం కీలక పాత్ర పోషించింది. మొత్తం టోర్నమెంట్‌లో అద్భుతమైన ప్రతిభ, వ్యూహాత్మక నైపుణ్యం ప్రదర్శించిన భారత మహిళా బాక్సర్లు, దేశానికి గర్వకారణంగా నిలిచారు.

# జెన్ జీ జమానా

**మొదటి పేజీ తరువాయి**

సోషల్ మీడియా ద్వారా విషయం వెలుగులోకి రావడంతోనే చర్యలు ప్రారంభమయ్యాయని కేటీఆర్ ఆరోపించారు. జర్నలిస్టులపై కేసులు నమోదు చేసి అరెస్టులు చేస్తున్నా మీడియా యాజమాన్యాలు ప్రశ్నించలేని పరిస్థితి నెలకొందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భాషను అదుపులో పెట్టుకోవాలని సూచించిన కేటీఆర్, తాను ఇతర రాష్ట్రాల్లో తెలంగాణ గౌరవాన్ని కాపాడే విధంగానే మాట్లాడానని చెప్పారు. హేట్ స్పీచ్‌పై చట్టం తీసుకురావాలంటే ముందుగా అధికారంలో ఉన్నవారే బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కేటీఆర్ అన్నారు. జంతర్‌మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళనలకు సంబంధించిన రీల్స్ తొలగించడం, సోషల్ మీడియా వేదికలపై కేంద్రం ఒత్తిడి తీసుకురావడం వంటి అంశాలను ప్రస్తావించారు. తెలంగాణలో సోషల్ మీడియాలో ఒక పోస్టును రీట్వీట్ చేసినందుకు వ్యక్తిని జైలుకు పంపిన ఘటనలను కూడా ఆయన ఉదాహరణగా పేర్కొన్నారు. సోషల్ మీడియా ద్వారా ఫేక్ న్యూస్ ప్రచారం జరుగుతోందన్న వ్యాఖ్యలకు స్పందించిన కేటీఆర్, గతంలో ప్రగతి భవన్‌లో 150 బెడ్‌రూమ్‌లు, బంగారు అల్మారాలు ఉన్నాయంటూ ప్రచారం చేయడం, కాళేశ్వరం ప్రాజెక్టుపై భారీ అవినీతి ఆరోపణలు చేయడం, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై వచ్చిన ప్రచారాన్ని ప్రస్తావిస్తూ అవి కూడా ఫేక్ న్యూస్ కాదా అని ప్రశ్నించారు. సోషల్ మీడియా అయినా, ప్రధాన మీడియా అయినా ఏ సమాచారం వచ్చినా ముందుగా వాస్తవ నిర్ధారణ (ఫ్యాక్ట్ చెక్) జరగాలని కేటీఆర్ సూచించారు. "నిజం గడప దాటేలోపే అబద్ధం ఊరంతా తిరిగి వస్తుంది" అంటూ తప్పుడు ప్రచారాలపై ఆయన వ్యాఖ్యానించారు.



## చట్టంగా 'యాంటీ పేపర్ లీక్'

**మొదటి పేజీ తరువాయి**

లీకేజీలను అరికట్టేలా కొత్త బిల్లును తీసుకొచ్చింది. ఇదే అంశంలో 2024లో తెచ్చిన బిల్లుకు సవరణలు తెస్తూ కొత్త బిల్లును ప్రవేశపెట్టింది. ఈ బిల్లును కాంగ్రెస్ సహా అనేక ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. ఈ బిల్లు ద్వారా పూర్తిస్థాయిలో పేపర్ లీకేజీలను అరికట్టలేమని ప్ర తిపక్షాలు వ్యాఖ్యానించాయి. అయితే, పేపర్ లీకేజీలను అడ్డుకునేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందువల్లే కొత్త బిల్లును రూపొందించామని కేంద్రం సమర్థించుకుంది. కొత్త బిల్లు ప్రకారం పేపర్ లీకేజీకి పాల్పడితే కఠిన శిక్షలు, జరిమానాలు విధిస్తారు. ఈ బిల్లులోని ప్రధానాంశాలివి. పేపర్ లీకేజీ కేసులను విచారించేందుకు ప్రతి రాష్ట్రంలో ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తారు. 90 రోజుల్లోనే విచారణ పూర్తి చేసి, శిక్షలు విధించేలా ఈ కోర్టులు నిరంతరం పని చేస్తాయి. పాత బిల్లు ప్రకారం పేపర్ లీకేజీకి పాల్పడితే వ్యక్తిగతంగా రూ.10 లక్షల వరకు జరిమానా విధించేవారు. కొత్త బిల్లు ప్రకారం రూ.50 లక్షల వరకు జరిమానా విధిస్తారు. ఒకవేళ సంస్థలు, వ్యవస్థీకృతంగా నేరానికి పాల్పడితే రూ.10 కోట్ల వరకు జరిమానా విధిస్తారు. అలాగే, గతంలో గరిష్టంగా మూడేళ్ల నుంచి ఐదేళ్ల వరకు శిక్ష విధించేవారు. ఇప్పుడు ఐదు నుంచి పదేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. ఇంతకుముందు కేంద్ర దర్యాప్తు సంస్థలు పేపర్ లీకేజీ కేసులపై విచారణ జరిపేది. కానీ, ఇకపై స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీంలు ఈ కేసుల్ని విచారిస్తాయి. గతంలో పేపర్ లీకేజీ కేసుల విచారణకు కాల పరిమితి అంటూ లేదు. కొత్త బిల్లు ప్రకారం ఈ కేసుల విచారణను రెండు నెలల్లో పూర్తి చేయాలి.

## ఈ-20 పెట్రోల్‌పై కేజ్రీవాల్ పోరుబాట

**మొదటి పేజీ తరువాయి**

ఢిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో ఈ-20 ఇంధనంపై ఏర్పాటు చేసిన టౌన్ హాల్ సమావేశంలో కేజ్రీవాల్ ప్రసంగించారు. మంగళవారం మధ్యాహ్నం ప్రజల నుంచి పిటిషన్లు స్వీకరించి, సుమారు 100 మందితో కలిసి లోక్ కళ్యాణ్ మార్గ్ లోని ప్రధాని నరేంద్ర మోదీ నివాసానికి పాదయాత్రగా వెళ్లి వాటిని అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ పలు కీలక డిమాండ్లు చేశారు. ఈ-20 పెట్రోల్ ధరను తగ్గించడంతో పాటు, సాధారణ పెట్రోల్ ధరలను కూడా తగ్గించాలని కోరారు. ఈ-20 వాడకం వల్ల వాహనాలకు ఎలాంటి నష్టం జరగదని కేంద్రం చెబుతోందని, ఆ వాదనకు ఆధారమైన అధ్యయన నివేదికను ప్రజల ముందు ఉంచాలని ఆయన సవాల్ విసిరారు. "కేంద్రం కొన్ని అధ్యయనాలు చేసిందని, ఈ-20 వల్ల వాహనాలకు హాని జరగదని చెబుతోంది. ఆ రిపోర్ట్‌ను మాతో పంచుకోవాలని నేను కోరుతున్నాను" అని కేజ్రీవాల్ పేర్కొన్నారు.

## 11,403 క్లర్క్ ఉద్యోగాలు

**మొదటి పేజీ తరువాయి**

ఉండాలి. దీంతో పాటు కంప్యూర్ పరిజ్ఞానం ఉండాలి. భారత్‌లో శాశ్వతంగా స్థిరపడాలని పాకిస్తాన్, బర్మా, శ్రీలంక, కెన్యా, ఉగాండా, టాంజానియా, జాంబియా, మలావి, రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఇథియోపియా, వియత్నాంల నుంచి వలస వచ్చిన భారతీయ సంతతికి చెందిన వ్యక్తులు కూడా అర్హులు. జనరల్ అభ్యర్థులకు రూ. 850, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు రూ. 175. ఫీజు ఇంటర్నెట్ బ్యాంకింగ్, డెబిట్/క్రెడిట్ కార్డ్, భీమ్ యూపీఐ, మాస్టర్‌కార్డ్ ద్వారా చెల్లించవచ్చు. ఈ ఫీజు రిఫండ్ చేయరు. కస్టమర్ సర్వీస్ అసోసియేట్, క్లరికల్ కేడర్ పోస్టులకు ప్రిలిమినరీ, మెయిన్స్, లోకల్ లాంగ్వేజ్ టెస్ట్‌ల ద్వారా ఎంపిక చేస్తారు. ఆన్‌లైన్‌లో చేసుకునే దరఖాస్తులకు చివితేదీ ఆగస్టు 21.

## రాష్ట్రాలకు 1,09,019 కోట్లు

**మొదటి పేజీ తరువాయి**

పథకాలు మరింత వేగంగా ముందుకు సాగే అవకాశం కలుగుతుంది. పన్నుల వాటా కింద ఏపీకి రూ. 4,597 కోట్లు విడుదలయ్యాయి. తెలంగాణ రాష్ట్రానికి రూ. 2,370 కోట్లు కేటాయించారు. కేంద్రం నుంచి అదనపు వాటా ముందుగానే అందడంతో తెలుగు రాష్ట్రాలు తీవ్ర నిధుల సమస్య నుంచి ఉపశమనం పొందే అవకాశముంది. మూలధన వ్యయం పెంచడానికి, సంక్షేమ కార్యక్రమాలను నిరంతరాయంగా అమలు చేయడానికి ఈ నిధులు ఎంతగానో దోహదపడతాయని కేంద్రం తెలిపింది.

## రూ.200 తగ్గిన కమర్షియల్ సిలిండర్ ధర

**మొదటి పేజీ తరువాయి**

కోల్‌కతాలో ఒక్కో వాణిజ్య సిలిండర్ ధర రూ.2,872.50కు చేరింది. హైదరాబాద్‌లో రూ.206 తగ్గి రూ.2,985గా ఉంది. ఇతర ప్రధాన నగరాల్లో కూడా దాదాపు ఇదే పరిధిలో ధరలు తగ్గించినట్లు ఓఎంసీలు వెల్లడించాయి. ఈ నిర్ణయంతో హోటళ్లు, రెస్టారెంట్లు, చిన్న వ్యాపార సంస్థలపై ఇంధన భారం కొంత తగ్గనుంది. ఇటీవల పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావంతో అంతర్జాతీయ ఇంధన ధరలు పెరగడంతో వాణిజ్య ఎల్పీజీ ధరలు పలుసార్లు పెరిగాయి. ఇప్పుడు ప్రపంచ ఇంధన మార్కెట్లు క్రమంగా స్థిరపడుతుండటంతో ఓఎంసీలు ధరలను తగ్గించాయి. గత నెల జులై 1న కూడా 19 కిలోల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరను రూ.183.50 వరకు తగ్గించారు. వరుసగా రెండో నెలా ధరలు తగ్గడంతో వ్యాపార వర్గాలు ఊరట వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు గృహ అవసరాలకు వినియోగించే 14.2 కిలోల ఎల్పీజీ సిలిండర్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పు లేకపోవడం గృహ వినియోగదారులకు నిరాశ కలిగిస్తోంది.

## లష్కర్ బోనాలకు సర్వం సిద్ధం

**మొదటి పేజీ తరువాయి**

ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించనున్నారు. ఆలయానికి దాదాపు 500 మీటర్ల దూరంలో ప్రత్యేక పార్కింగ్ స్లాట్లను ఏర్పాటు చేశారు. వాహనాలను పార్కింగ్ స్థలాల్లోనే నిలిపివేసి, కాలినడకన ఆలయానికి చేరుకోవాలని అధికారులు సూచించారు.

## ఎల్లుండి నుంచి నీట్ యూజీ కౌన్సెలింగ్

**మొదటి పేజీ తరువాయి**

8 నుంచి మొదలవుతుందని స్పష్టం చేసింది. తొలి రౌండ్‌లో ఆల్ ఇండియా కోటా, డీమ్డ్, సెంట్రల్ యూనివర్సిటీల కౌన్సెలింగ్ ఆగస్టు 4 నుంచి 17 వరకు జరుగుతుంది. ఈ రౌండ్‌లో సీట్లు పొందిన అభ్యర్థులు ఆగస్టు 22వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చేరాల్సి ఉంటుంది. ఆగస్టు 23న వెరిఫికేషన్ ప్రక్రియ ఉంటుంది. ఇక రాష్ట్రాల కోటా మొదటి రౌండ్ కౌన్సెలింగ్ ఆగస్టు 13 నుంచి 22 వరకు నిర్వహిస్తారు. రెండో రౌండ్ కౌన్సిలింగ్ విషయానికి వస్తే, ఆల్ ఇండియా కోటా ప్రక్రియ ఆగస్టు 24 నుంచి సెప్టెంబర్ 2 వరకు, రాష్ట్రాల కోటా కౌన్సెలింగ్ ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 8 వరకు కొనసాగుతుంది. నిర్దేశిత షెడ్యూల్‌ను సకాలంలో పూర్తి చేసేలా శని, ఆదివారాలు మరియు ఇతర సెలవు దినాల్లోనూ పనిచేయాలని అన్ని మెడికల్ కాలేజీలను ఎన్‌టీఏ ఆదేశించింది. తదుపరి రౌండ్లు, స్ట్రే వేకెన్సీలతో కలిపి అక్టోబర్ 10 నాటికి ప్రవేశాల ప్రక్రియను సంపూర్ణంగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో మే 3న జరిగిన పరీక్షను రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత ప్రభుత్వం 47 మంది ఎన్‌టీఏ అధికారులను విధుల నుంచి తొలగించి, చట్టపరమైన చర్యలు చేపట్టింది. అనంతరం నిర్వహించిన రీ-టెస్ట్ ఫలితాలను జులై 16న ప్రకటించారు. ఈ క్రమంలోనే తాజాగా కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది.

## 19 నుంచి ఖాకీ దరఖాస్తులు

**మొదటి పేజీ తరువాయి**

మొత్తం ఖాళీలలో అత్యధికంగా కానిస్టేబుల్, ఆ పైస్థాయి ఉద్యోగాలే ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. పోస్టుల వివరాలను పరిశీలిస్తే సివిల్ ఎస్సై-148, ఏఆర్ ఎస్సై-14, టీజీఎస్పీ ఏఆర్ ఎస్సై-12, ఎస్ఏఆర్ సీపీఎల్ ఎస్సై-03, ఫింగర్ ప్రింట్ బ్యూరో ఏఎస్సై-23, సివిల్ కానిస్టేబుల్-3,697, ఏఆర్ కానిస్టేబుల్-1,052, ఎస్ఏఆర్ సీపీఎల్ కానిస్టేబుల్-24, కానిస్టేబుల్ (డ్రైవర్) పీటీవో-20, కానిస్టేబుల్ (మెకానిక్) పీటీవో-07 చొప్పున ఖాళీలు ఉన్నాయి.

# 5.9 కోట్ల ఐటీఆర్ దాఖలు

## చివరి రోజే 40 లక్షల రిటర్నులు

న్యూఢిల్లీ: 2026-27 అసెస్‌మెంట్ సంవత్సరానికి జులై 31 గడువు ముగిసే సమయానికి 5.9 కోట్లకు పైగా ఐటీఆర్‌లు దాఖలైనట్లు ఆదాయపన్ను శాఖ శనివారం వెల్లడించింది. గడువులోగా రిటర్నులు సమర్పించిన పన్ను చెల్లింపుదారులకు కృతజ్ఞతలు తెలిపింది. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో ఆదాయపన్ను శాఖ స్పందిస్తూ.. "పన్ను చెల్లింపుదారుల విశ్వాసం, సకాలంలో నిబంధనలు పాటించడం భారత ఆర్థికాభివృద్ధికి శక్తినిస్తోంది" అని పేర్కొంది. గడువు చివరి రోజైన జులై 31న ఒక్కరోజే 40 లక్షలకు పైగా ఐటీఆర్‌లు దాఖలయ్యాయి. ఆడిట్ అవసరం లేని వ్యక్తులు, సంస్థలకు జులై 31 చివరి తేదీ కావడంతో చివరి రోజున భారీ సంఖ్యలో రిటర్నులు సమర్పించారు. గడువు సమీపించే కొద్దీ ఐటీఆర్‌ల దాఖలు వేగం గణనీయంగా పెరిగింది. జులై 11 నాటికి 1.7 కోట్లకు పైగా రిటర్నులు దాఖలు కాగా.. జులై 22 నాటికి ఆ సంఖ్య 3 కోట్లకు చేరింది. జులై 27 నాటికి 4 కోట్ల మార్కు దాటగా, జులై 31న 5 కోట్లను అధిగమించింది. చివరకు గడువు ముగిసే సమయానికి 5.9 కోట్లకు పైగా ఐటీఆర్‌లు నమోదయ్యాయి. చివరి నిమిషం వరకు వేచి ఉండొద్దని ఆదాయపన్ను శాఖ పలుసార్లు పన్ను చెల్లింపుదారులను కోరింది. ఈ-ఫైలింగ్ పోర్టల్‌పై అధిక భారం, సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున ముందుగానే రిటర్నులు దాఖలు చేయాలని సూచించింది. 2026-27 అసెస్‌మెంట్ సంవత్సరానికి సవరించిన ఐటీఆర్ ఫారాలను కేంద్ర ప్రత్యక్ష పన్నుల మండలి (సీబీడీటీ) ఇప్పటికే విడుదల చేసింది. దీర్ఘకాలిక మూలధన లాభాలు, షేర్ బైబ్యాక్‌ల వల్ల కలిగిన నష్టాలు, కొన్ని ట్రేడింగ్ లావాదేవీలకు సంబంధించిన వివరాలను తప్పనిసరిగా వెల్లడించేలా కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. గత ఆర్థిక సంవత్సరంలో 9 కోట్లకు పైగా ఐటీఆర్‌లు దాఖలు కాగా, రూ.4.35 లక్షల కోట్లకు పైగా ఆదాయపన్ను రిఫండ్‌లు జారీ చేసినట్లు సంబంధిత శాఖ వెల్లడించింది.



# మందులతోనే కాదు.. మాటతోనూ భరోసా!


**చికిత్సతో పాటు మానసిక ధైర్యాన్ని అందిస్తున్న డా. ఎం. మనోజ్ రెడ్డి.. ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో పెరుగుతున్న ప్రజల ఆదరణ**

### పాత రోగులూ వెతుక్కుంటూ వస్తున్న వైనం

**వైద్యం అంటే కేవలం వ్యాధికి మందులు రాసి పంపించడం కాదు.. రోగి చెప్పే సమస్యను ఓపికగా వినడం, వ్యాధి గురించి అర్థమయ్యేలా వివరించడం, చికిత్సపై అవగాహన కల్పించడంతో పాటు మానసిక ధైర్యాన్ని అందించడం కూడా వైద్య సేవలో అంతర్భాగమే. ఈ సిద్ధాంతాన్ని ఆచరణలో చూపిస్తూ ప్రజల విశ్వాసాన్ని చూరగొంటున్నారు డా. ఎం. మనోజ్ రెడ్డి.**







హైదరాబాద్, ఆగస్టు 1 (ఈవార్తలు): ప్రస్తుత కాలంలో వైద్య రంగం వేగంగా మారుతున్నప్పటికీ, రోగితో సమయం కేటాయించి మాట్లాడటం, వారి సందేహాలను నివృత్తి చేయడం, వ్యాధి పట్ల ఉన్న భయాలను తొలగించి ధైర్యం కల్పించడం ఎంతో కీలకం. ఈ విషయంలో డా. మనోజ్ రెడ్డి ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. తన సేవా దృక్పథం, మానవీయ విలువలు, రోగుల పట్ల చూపే ఆప్యాయతతో వేలాది మంది విశ్వాసాన్ని సంపాదించుకున్నారు. వైద్యుడి బాధ్యత కేవలం మందులు సూచించడంతో ముగియదని ఆయన విశ్వసిస్తారు. ప్రతి రోగి చెప్పే సమస్యను పూర్తిగా విని, దాని మూల కారణాలను అర్థం చేసుకోవడంతో పాటు వ్యాధి స్వభావం, చికిత్స విధానం, మందుల వినియోగం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లు, జీవనశైలి మార్పులను సరళమైన భాషలో వివరించడం ఆయన వైద్య సేవల్లో ప్రత్యేకతగా నిలుస్తోంది. ఈ విధానం రోగుల్లో చికిత్సపై నమ్మకాన్ని పెంచడంతో పాటు వైద్యుడితో అనుబంధాన్ని ఏర్పరుస్తోంది.

**ప్రజారోగ్య పరిరక్షణలోనూ ముందడుగు**

ప్రస్తుతం యూపీహెచ్‌సీ ముషీరాబాద్‌లో మెడికల్ ఆఫీసర్‌గా సేవలందిస్తున్న డా. మనోజ్ రెడ్డి తన సేవలను కేవలం ఓపీ చికిత్సకే పరిమితం చేయకుండా ప్రజారోగ్య పరిరక్షణలోనూ చురుగ్గా పాల్గొంటున్నారు. ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించేందుకు వివిధ ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, వ్యాధి నిరోధక చర్యల్లో భాగస్వామ్యం అవుతున్నారు. జీవనశైలి వ్యాధులు, తల్లి-శిశు ఆరోగ్యం, టీకాల ప్రాముఖ్యతతో పాటు డెంగ్యూ, మలేరియా, క్షయవ్యాధి వంటి అంటువ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ సమాజ ఆరోగ్య పరిరక్షణకు తన వంతు కృషి చేస్తున్నారు.

**ముషీరాబాద్‌లో పెరుగుతున్న ఆదరణ**

ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో అందుబాటులోకి వచ్చిన తర్వాత ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు. వైద్య సేవల కోసం వచ్చే ప్రతి ఒక్కరి సమస్యను ఓపికగా విని, సందేహాలను నివృత్తి చేసి, వ్యాధి గురించి స్పష్టంగా వివరించడం వల్ల ఆయనపై ప్రజల్లో విశేషమైన నమ్మకం ఏర్పడింది. గతంలో హిమాయత్‌నగర్ ముత్యాల్‌బాగ్ బస్తీ దవాఖాన, కోటి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో సేవలందించిన సమయంలోనూ డా. మనోజ్ రెడ్డి తన సేవాభావంతో అనేక మంది రోగుల అభిమానాన్ని పొందారు. అక్కడ ఆయన వద్ద చికిత్స పొందిన కొందరు రోగులు ప్రస్తుతం ఆయన ముషీరాబాద్‌లో సేవలందిస్తున్న విషయం తెలుసుకొని ప్రత్యేకంగా అక్కడికి వచ్చి వైద్య సేవలు పొందుతున్నారని స్థానికులు తెలిపారు. దీంతో వైద్యుడిపై రోగులకు ఏర్పడిన విశ్వాసానికి నిదర్శనమని చెప్పవచ్చు. హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా కొందరు రోగులు డా. మనోజ్ రెడ్డిని సంప్రదించేందుకు వస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లోనూ నాణ్యమైన, మానవీయ వైద్య సేవలను అందించవచ్చని తన పనితీరుతో చాటిచెబుతున్న డా. మనోజ్ రెడ్డి ప్రజారోగ్య రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. రోగులకు చికిత్స అందించడమే కాకుండా సమాజంలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు చేస్తున్న కృషి ప్రశంసలు అందుకుంటోంది. రోగిని గౌరవించడం.. వారి బాధను అర్థం చేసుకోవడం.. సరైన చికిత్స అందించడం.. ఆరోగ్యంపై అవగాహన కల్పించడం.. అన్నింటికంటే వారికి "మీరు కోలుకుంటారు" అనే నమ్మకాన్ని కలిగించడం వైద్య సేవలో ఎంతో ముఖ్యమనే సందేశాన్ని ఆయన తన సేవల ద్వారా చాటుతున్నారు. 'మా సమస్యను పూర్తిగా వింటారు. వ్యాధి గురించి మాకు అర్థమయ్యేలా చెబుతారు. మందులతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తారు. ముఖ్యంగా మాకు ధైర్యం చెప్పి పంపిస్తారు. అందుకే దూరమైనా ఆయన వద్దకే వస్తాం' అని ముత్యాల్‌బాగ్ బస్తీకి చెందిన సరిత తెలిపారు.

**రోగికి నమ్మకం కల్పించడం చికిత్సలో భాగమే**

"వైద్యం అంటే కేవలం మందులు రాయడం మాత్రమే కాదు. రోగి చెప్పే సమస్యను ఓపికగా విని, వ్యాధి గురించి వారికి అర్థమయ్యే భాషలో వివరించాలి. మందులు ఎలా వాడాలి, ఎలాంటి ఆహారం తీసుకోవాలి, జీవనశైలిలో ఎలాంటి మార్పులు చేసుకోవాలి అనే విషయాలపై అవగాహన కల్పించాలి. ముఖ్యంగా రోగిలో ఉన్న భయాన్ని తొలగించి, చికిత్సపై నమ్మకం కలిగించాలి. ప్రతి రోగికి గౌరవంతో, బాధ్యతతో వైద్య సేవలు అందించడమే నా లక్ష్యం."

**- డాక్టర్ ఎం మనోజ్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్, యూపీహెచ్‌సీ ముషీరాబాద్**

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

**ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..**
**ఎవరికీ కొమ్ముకాయని పథం..**
**ప్రజా సమస్యలపై యుద్ధం..**
**ప్రజా హితమే మా శపథం..**
**ప్రజాపోరులో మేము సంసిద్ధం..**
**ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!**

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

**- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్**

సందేహాలకు **94404 55811** నంబర్‌ను సంప్రదించవచ్చు.

## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**10 మంది లబ్ధిదారులకు రూ.10 లక్షల ఆర్థిక సాయం**

ధర్మపురి, ఆగస్టు 1 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ధర్మపురి మండలానికి చెందిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం ధర్మపురి క్యాంపు కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేశారు. మొత్తం 10 మంది లబ్ధిదారులకు సుమారు రూ.10 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనబట్ల దినేష్, తహసీల్దార్ ఎరుకొండ శ్రీనివాస్, ఎంపీడీవో పత్తి రవీందర్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

**తపస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మహా ధర్నా**

హైదరాబాద్, ఆగస్టు 1 (ఈవార్తలు): పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు బోయినిపెల్లి ప్రసాద్‌రావు డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద తపస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా ధర్నాలో జగిత్యాల జిల్లా నుంచి ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రావు మాట్లాడుతూ ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని, మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని ప్రకటించాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని, మోడల్ స్కూల్, కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కుల రాజేష్, రాష్ట్ర, జిల్లా బాధ్యులు, వివిధ మండలాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వేములవాడలో ప్రైవేట్ ఆసుపత్రులపై ఆకస్మిక తనిఖీలు

**అనుమతులు లేని రెండు నిర్ధారణ కేంద్రాలకు నోటీసులు జారీ**

వేములవాడ అర్బన్, ఆగస్టు 1 (ఈవార్తలు): వేములవాడ పట్టణంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులు, వ్యాధి నిర్ధారణ కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రుల్లో సేవల రుసుముల పట్టికను స్పష్టంగా ప్రదర్శించడం, వైద్యుల వివరాలు అందుబాటులో ఉంచడం, బయోమెడికల్ వ్యర్థాలను నిబంధనల ప్రకారం నిర్వహించడం, కాలుష్య నియంత్రణ చర్యలు, అగ్నిమాపక భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని యాజమాన్యాలకు సూచించారు. వ్యాధి నిర్ధారణ కేంద్రాల్లో గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ నిషేధ చట్టం (పీసీపీఎన్‌డీటీ)ను కచ్చితంగా అమలు చేయాలని, గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టవిరుద్ధమని హెచ్చరించారు. ఫామ్-ఎఫ్ నమోదులను సక్రమంగా నిర్వహించి, ప్రతి నెలా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. తనిఖీల సందర్భంగా అవసరమైన అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న రెండు వ్యాధి నిర్ధారణ కేంద్రాలను గుర్తించిన అధికారులు వాటి యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశారు. ఈ తనిఖీల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సెక్షన్ ఇన్‌చార్జి మహేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## 6,307 మంది చిన్నారులను కాపాడిన పోలీసులు

హైదరాబాద్, ఆగస్టు 1 (ఈవార్తలు): ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా జులై 1 నుంచి 31వ తేదీ వరకు తెలంగాణ వ్యాప్తంగా పోలీసులు ప్రత్యేక సోదాలు నిర్వహించారు. హోటళ్లు, టీ స్టాళ్లు, భవన నిర్మాణ ప్రాంతాలు, మెకానిక్ షాపులు, ఇటుక బట్టీలు, కిరాణా దుకాణాలు తదితర చోట్ల తనిఖీలు చేపట్టి.. మొత్తం 6,307 మంది చిన్నారులను కాపాడారు. వారిలో 5,892 మంది బాలురు, 415 మంది బాలికలు ఉన్నారు. తెలంగాణకు చెందిన వారు 3,447 మంది కాగా.. నేపాల్‌కు చెందినవారు 2,860 మంది ఉన్నారు. మొత్తం 1,705 కేసులు నమోదు చేసిన పోలీసులు 1,710 మంది నిందితులను అరెస్టు చేశారు. 5,737 మంది చిన్నారులను కుటుంబాలతో కలిపిన అధికారులు.. మరో 570 మందిని శిశు సంరక్షణ కేంద్రాలకు తరలించారు.



# కాళేశ్వరం భద్రతే తొలి ప్రాధాన్యం

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

పెద్దపల్లి, ఆగస్టు 1 (ఈవార్తలు): బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో నిర్మాణ లోపాల వల్లే సమస్యలు తలెత్తాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. పెద్దపల్లిలో జిల్లాలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజ్, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టు, ఎల్లంపల్లి ప్రాజెక్టుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఎస్ఆర్ఎస్పీ, కడెం, ఎల్లంపల్లి వంటి ప్రధాన ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిర్మించామని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిగా దృఢంగా ఉందని, అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన మేడిగడ్డ, కాళేశ్వరం ప్రాజెక్టుల్లో నిర్మాణ లోపాల కారణంగ సమస్యలు తలెత్తాయని విమర్శించారు. ఎల్లంపల్లి పంపులను ఆన్ చేసి మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోశామని బీఆర్ఎస్ ప్రచారం చేసుకుందని, కానీ వాస్తవ పరిస్థితులు అందరికీ తెలుసని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. 'జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ నివేదికల ఆధారంగానే ప్రస్తుతం బ్యారేజీల్లో నీటి నిల్వలను పరిమితం చేస్తున్నాం. కన్నెపల్లి పంపులను వెంటనే ఆన్ చేయాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉంది. సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ ప్రాజెక్టుల ఫౌండేషన్ సక్రమంగా లేదు. ఐఐటీ బాంబే, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు వచ్చే వర్షాకాలం వరకు నీటి నిల్వలను నియంత్రిస్తాం. భద్రతా సూచనలను విస్మరించి నీటిని నిల్వ చేస్తే డ్యాం దిగువన ఉన్న గ్రామాలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది. అలాంటి పరిస్థితుల్లో బాధ్యత ఎవరు వహిస్తారు' అని అన్నారు.

## నాపై కోపంతోనే ఎస్ఎల్‌బీసీ ఆపారు

**కేసీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఫైర్**



నల్లగొండ, ఆగస్టు 1 (ఈవార్తలు): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తనపై ఉన్న రాజకీయ కక్షతోనే శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం పనులను గతంలో కేసీఆర్ ఉద్దేశపూర్వకంగా విస్మరించారని ఆయన ఆరోపించారు. శనివారం నల్లగొండ జిల్లాలోని పలు మండలాల్లో పర్యటించిన మంత్రి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ, "2007లోనే అమెరికా నుంచి యంత్రాలు తెప్పించి సొరంగం పనులు ప్రారంభిస్తే, కేవలం నాకు పేరు వస్తుందనే దురుద్దేశంతో కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక వాటిని నిలిపివేశారు. అప్పట్లో ఆ పనులను కొనసాగించి ఉంటే రూ.1,000 కోట్లతో రెండేళ్లలోనే పూర్తయ్యేవి. నేను ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా కేసీఆర్ కనికరించలేదు" అని ఆవేదన వ్యక్తం చేశారు. సొరంగం పనులు పూర్తయి ఉంటే, ప్రస్తుత కరవు పరిస్థితుల్లోనూ నల్గొండ ప్రాంతంలోని 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, తాము అమెరికాకు వెళ్లి కాంట్రాక్టర్‌కు రూ.300 కోట్లు చెల్లించి పనులను పునరుద్ధరించామని తెలిపారు. వచ్చే రెండేళ్లలో సొరంగం పనులు పూర్తి చేసి, రెండు పంటలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. 2028 జూలై నాటికి ఈ సొరంగాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయనందుకు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ప్రజలకు క్షమాపణ చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. వారి వైఫల్యం వల్లే ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడ్డారని, అందుకే గత ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ప్రజలు తిరస్కరించారని వ్యాఖ్యానించారు. రానున్న ఎన్నికల నాటికి తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ కనుమరుగవడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు.



## 25 నిమిషాల్లో మెట్రోలో అవయవాల తరలింపు

హైదరాబాద్, ఆగస్టు 1 (ఈవార్తలు): హైదరాబాద్ మెట్రో రైలు అత్యవసర అవయవ మార్పిడి కోసం ప్రత్యేక 'గ్రీన్ ఛానెల్'ను ఏర్పాటు చేసి, ప్రాణాలను కాపాడే బృహత్కార్యంలో కీలక భాగస్వామిగా నిలిచింది. గచ్చిబౌలి నుంచి సికింద్రాబాద్‌కు సజీవ అవయవాలైన గుండె, ఊపిరితిత్తులను మెట్రో ద్వారా అత్యంత వేగంగా తరలించారు. గచ్చిబౌలిలోని కేర్ ఆసుపత్రి నుంచి సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి ఈ అవయవాలను తరలించాల్సి ఉండగా, రోడ్డు మార్గంలోని ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వైద్య బృందం మెట్రో అధికారుల సహకారం కోరింది. దీనిపై తక్షణమే స్పందించిన అధికారులు ప్రత్యేక గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేశారు. ఫలితంగా దాదాపు 14 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 25 నిమిషాల్లోనే అధిగమించి, అవయవాలను సురక్షితంగా కిమ్స్ ఆసుపత్రికి చేర్చారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి అత్యవసర వైద్య సేవలకు, ప్రాణ రక్షణ చర్యలకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని మెట్రో రైలు అధికారులు ఈ సందర్భంగా తెలిపారు.

## త్వరలో మెట్రో రైలు, ఆర్టీసీకి ఒకే టికెట్!

హైదరాబాద్, ఆగస్టు 1 (ఈవార్తలు): హైదరాబాద్ ప్రయాణికులకు ప్రజా రవాణాను మరింత సులభతరం చేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. మెట్రో రైలు, టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో ఒకే టికెట్‌తో ప్రయాణించే వెసులుబాటును అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తోంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ అధ్యక్షతన నిన్న జరిగిన హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) బోర్డు సమావేశంలో ఈ ప్రతిపాదనపై చర్చించారు. ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రో, ఆర్టీసీ సేవలను అనుసంధానిస్తూ 'కామన్ మొబిలిటీ టికెటింగ్' (ఒకే టికెట్ విధానం) విధానాన్ని రూపొందించాలని సీఎస్ సంజయ్ జాజూ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం టీజీఎస్ఆర్టీసీ అధికారులతో సంప్రదింపులు జరపాలని, ప్రయాణికులందరికీ ఉపయోగపడేలా ఒక ఉమ్మడి మొబైల్ అప్లికేషన్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. అంతేకాకుండా, మెట్రో ప్రయాణికుల కోసం ప్రత్యేకంగా రోజువారీ, వారపు, నెలవారీ ట్రావెల్ పాస్‌లను ప్రవేశపెట్టే అవకాశాలను పరిశీలించాలని కోరారు. మెట్రో నెట్‌వర్క్ విస్తరిస్తున్న నేపథ్యంలో, ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అదనపు మెట్రో కోచ్‌ల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మెట్రో రెండో దశ (ఫేజ్-2)కు సంబంధించిన భూసేకరణ, ఇతర పనుల పురోగతిని కూడా సమీక్షించారు.

## మెటా హెడ్‌పై కేసు రెండ్రోజులకే డీసీపీపై వేటు

హైదరాబాద్, ఆగస్టు 1 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖలో కీలక పరిణామం చోటుచేసుకుంది. హైదరాబాద్ సైబర్ క్రైమ్స్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) వి. అరవింద్ బాబును ప్రభుత్వం బాధ్యతల నుంచి తప్పించింది. ఆయనను తక్షణమే రాష్ట్ర పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రధాని నరేంద్ర మోదీకి సంబంధించిన అభ్యంతరకర వీడియోల వ్యవహారంలో మెటా ఇండియా హెడ్‌పై కేసు నమోదు చేసిన రెండు రోజులకే ఈ బదిలీ జరగడం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల నీట్ పేపర్ లీక్ వ్యవహారానికి సంబంధించి 'కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)' పేరుతో నిర్వహించిన నిరసనల క్రమంలో, ప్రధాని మోదీకి సంబంధించిన మార్ఫింగ్ చేసిన అభ్యంతరకర వీడియోలు, చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీనిపై బీజేపీ సానుభూతిపరుడు ఎస్. అరవింద్ రెడ్డి, పార్టీ కార్యకర్త టి. సాయికిరణ్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదుల మేరకు సైబర్ క్రైమ్ పోలీసులు గురువారం ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. మెటా ఇండియా హెడ్ అరుణ్ శ్రీనివాస్‌తో పాటు సుమారు 20 అభ్యంతరకర లింకులకు సంబంధించిన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), ఐటీ చట్టం కింద కేసులు నమోదు చేశారు. ఈ పరిణామం చోటుచేసుకున్న రెండు రోజులకే డీసీపీ అరవింద్ బాబుపై బదిలీ వేటు పడటాన్ని తెలంగాణ బీజేపీ తీవ్రంగా ఖండించింది. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ కక్ష సాధింపు చర్య అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఆరోపించారు. చట్ట ప్రకారం తన విధిని నిర్వర్తించిన అధికారిపై సరికాదని, ప్రధాని మోదీపై ఉన్న ద్వేషంతోనే ప్రభుత్వం ఇలా వ్యవహరించిందని ఆయన విమర్శించారు. దీనిని ఆయన 'తుగ్లక్ తరహా పాలన"గా అభివర్ణించారు. ప్రధానిని దూషించే వారిని కాపాడుతూ, నిజాయతీగా పనిచేసే అధికారులను ప్రభుత్వం భయభ్రాంతులకు గురిచేస్తోందని బీజేపీ నేతలు మండిపడ్డారు.

# రెసిడెన్షియల్ స్కూళ్ల సమస్యలు పరిష్కరించాలి

**వీజేఎస్ అధ్యక్షుడు కడారి రమేశ్.. సొసైటీ కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో ఖాళీ కుర్చీకి వినతిపత్రం**

హైదరాబాద్, ఆగస్టు 1 (ఈవార్తలు): తెలంగాణ మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన వర్గాల రెసిడెన్షియల్ విద్యాసంస్థల సొసైటీ పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యార్థి జన సమితి (వీజేఎస్) ఉస్మానియా విశ్వవిద్యాలయ అధ్యక్షుడు కడారి రమేశ్ యాదవ్ డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలపై వినతిపత్రం అందజేసేందుకు సొసైటీ ప్రధాన కార్యాలయానికి వెళ్లగా, సొసైటీ కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో పాటు కార్యాలయంలోకి అనుమతించలేదని ఆయన తెలిపారు. దీంతో నిరసనగా కార్యదర్శి కార్యాలయంలోని కుర్చీకి ప్రతీకాత్మకంగా వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కడారి రమేశ్ యాదవ్ మాట్లాడుతూ, విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడిచినా అనేక రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు ఇప్పటికీ యూనిఫాంలు అందలేదని అన్నారు. పలు సబ్జెక్టుల్లో ఉపాధ్యాయుల కొరత కొనసాగుతుండడంతో విద్యార్థుల చదువుపై ప్రతికూల ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థుల విద్యాభ్యాసాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాల నివారణకు ప్రతి రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, వైద్య శిబిరాలు నిర్వహించాలని, స్వచ్ఛమైన తాగునీరు, పోషకాహారం, దోమల నివారణ చర్యలు, విద్యార్థుల ఆరోగ్య పర్యవేక్షణను అత్యవసరంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న యూనిఫాంలను వెంటనే పంపిణీ చేయాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో కలిసి ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం చివరి వరకు పోరాటం కొనసాగిస్తామని కడారి రమేశ్ యాదవ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి జన సమితి రాష్ట్ర కార్యదర్శి జిల్లపెల్లి దిలీప్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి డప్పు గోపి, సురేష్, మనోజ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.





## 74 లక్షలతో విద్యుత్ తీగల మార్పిడి పనులకు శ్రీకారం

**గొల్లపల్లిలో పనులు ప్రారంభించిన మంత్రి అడ్లూరి**

గొల్లపల్లి, ఆగస్టు 1 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో విద్యుత్ సరఫరా వ్యవస్థను మెరుగుపరిచే లక్ష్యంతో రూ. 74 లక్షల వ్యయంతో చేపట్టిన 11 కేవీ, 33 కేవీ విద్యుత్ తీగల మార్పిడి (షిఫ్టింగ్) పనులకు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శంకుస్థాపన చేశారు. అధికారులతో కలిసి పనులను ప్రారంభించి, వాటి పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ధర్మపురి నియోజకవర్గంలో విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ. 4 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. ఇందులో గొల్లపల్లి మండలానికి దాదాపు రూ. 2.30 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## 80 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**వైద్య సదుపాయాల విస్తరణకు కృషి**

**జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్**

జగిత్యాల, ఆగస్టు 1 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలో వైద్య సేవలను మరింత విస్తరించి ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ తెలిపారు. శనివారం మోతే రోడ్డులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణానికి చెందిన 80 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ. 80.60 లక్షల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి కుటుంబాలకు అత్యవసర వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగపడుతోందన్నారు. జగిత్యాలకు రాష్ట్రంలోనే అత్యధిక సీఎంఆర్ఎఫ్ మంజూరయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. జగిత్యాల వైద్య కళాశాలలో 800కుపైగా పడకలు అందుబాటులోకి రానున్నాయని, డయాలసిస్, ఈసీజీ, పారామెడికల్ తదితర వైద్య సేవలను విస్తరిస్తున్నట్లు చెప్పారు. అలాగే పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో ట్రామా కేంద్రం, ఆరోగ్య కేంద్రం ఏర్పాటు కోసం చర్యలు చేపట్టామని వెల్లడించారు. జగిత్యాలకు ట్రామా కేంద్రం మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ట్రామా కేంద్రం అందుబాటులోకి వస్తే రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర వైద్యం అందించి ప్రాణనష్టాన్ని తగ్గించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సేవలను మరింత పెంచడంతో పాటు పారామెడికల్ కోర్సులను విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్, కో-ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్, ముజీబ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, యువజన నాయకులు పాల్గొన్నారు.

## గంజాయి కేసులో ఇద్దరికి ఏడేళ్ల జైలు

**ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా**

జగిత్యాల, ఆగస్టు 1 (ఈవార్తలు): గంజాయి సరఫరా, విక్రయానికి పాల్పడిన ఇద్దరు నిందితులకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ. 10 వేల జరిమానా విధిస్తూ జగిత్యాల మొదటి అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి జి. సునీత రవీంద్రరెడ్డి శనివారం తీర్పు వెలువరించారు. పోలీసుల వివరాల ప్రకారం.. 2023 అక్టోబరు 31న రాయికల్ మండలం అల్లీపూర్ శివారులోని పెద్దమ్మ ఆలయం సమీపంలో ఎస్సారెస్పీ కాలువ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో జగిత్యాల వైపు నుంచి హోండా యాక్టివాపై వస్తున్న ఇద్దరు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. వారిని బోదసు సతీష్ (ఏ1), బెక్కం రేవంత్ (ఏ2)గా గుర్తించారు. వారి వద్ద తనిఖీ చేయగా మొత్తం 1.560 కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు లభించినట్లు పోలీసులు తెలిపారు. సతీష్ వద్ద 1.050 కిలోలు, రేవంత్ వద్ద 510 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అప్పటి ఎస్ఐ అజయ్, జగిత్యాల సీఐ ఆరిఫ్ అలీఖాన్ దర్యాప్తు చేపట్టి ఫోరెన్సిక్ నివేదికలు, సాక్ష్యాలతో చార్జిషీట్ దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బిట్ల నర్సయ్య వాదనలు వినిపించగా, సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితులను దోషులుగా నిర్ధారించి శిక్ష విధించారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, సరఫరాపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందన్నారు. గంజాయి సాగు, రవాణా, విక్రయాలకు పాల్పడితే ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. కేసు దర్యాప్తులో కృషి చేసిన సీఐ ఆరిఫ్ అలీఖాన్, ఎస్ఐ అజయ్, పీపీ బిట్ల నర్సయ్య, సీఎంఎస్ ఎస్ఐ ఎస్. శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ నరేష్, సీఎంఎస్ కానిస్టేబుల్ రాజులను ఎస్పీ అభినందించారు.




## భీమన్న గుడిలో ఘనంగా ముగిసిన వరుణయాగం

వేములవాడ అర్బన్, ఆగస్టు 1 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడలోని శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో లోకకళ్యాణం, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని సంకల్పిస్తూ నిర్వహించిన మూడు రోజుల వరుణయాగ మహోత్సవాలు శనివారం పూర్ణాహుతితో వైభవంగా ముగిశాయి. రాష్ట్రంలో అనావృష్టి పరిస్థితులు తొలగి, ప్రజలు సుఖశాంతులతో జీవించాలని, రైతులకు పంటలు సమృద్ధిగా పండేలా సకాలంలో వర్షాలు కురవాలని సంకల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు, దేవాదాయ శాఖ ఆదేశాలపై జూలై 30 నుంచి ఆగస్టు 1 వరకు ఈ మహాయాగాన్ని నిర్వహించారు. మహోత్సవాల్లో భాగంగా ఋష్యశృంగ మహర్షి ప్రతిష్ఠ, దేవతా పూజలు, గౌరీ పూజ, విశ్వశాంతి క్రతువులు, వాస్తు హోమం, నవగ్రహ హోమం, పరివార దేవతా హోమం, వరుణ పర్జన్య జపానుష్ఠానాలు, ఇంద్రాది దేవతల జపాలు, హవనాలు, శ్రీ భీమేశ్వర స్వామివారికి సంతత ధారాభిషేకం తదితర వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అదేవిధంగా ప్రధాన ఆలయ దేవత శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని ఏకాంతంగా నిర్వహించారు. అనంతరం వరుణ పర్జన్య దీపారాధనతో పాటు ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. మహోత్సవాల చివరి రోజు మూలమంత్ర హోమంతో పాటు ఇతర వైదిక క్రతువులు నిర్వహించి ఉదయం 10.30 నుంచి 11 గంటల మధ్య పూర్ణాహుతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం 108 కలశాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి స్వామివారికి మహామంగళహారతి సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్. రమాదేవి మాట్లాడుతూ, భగవంతుని కృపతో రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, వ్యవసాయం సమృద్ధిగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి జయకుమారి, పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, ఆలయ అర్చకులు, వేదపండితులు, అధికారులు, ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.





## పరిపాలన న్యాయమూర్తిని కలిసిన బార్ అసోసియేషన్

వేములవాడ అర్బన్, ఆగస్టు 1 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా పరిపాలన న్యాయమూర్తి ఎన్. తుకారం జీని వేములవాడ బార్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిట్టల మనోహర్ ఆధ్వర్యంలో వెళ్లిన కార్యవర్గ సభ్యులు న్యాయమూర్తిని శాలువాతో సన్మానించి, శివుడి ప్రతిమను అందజేశారు. అనంతరం వేములవాడ కోర్టులో నెలకొన్న పలు సమస్యలను వివరిస్తూ వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రాన్ని స్వీకరించిన న్యాయమూర్తి ఎన్. తుకారం జీ సమస్యలను సానుకూలంగా పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు బార్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి న్యాయమూర్తి ప్రేమలత, సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్ జాదవ్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పెంట రాజు, వేముల సుధాకర్ రెడ్డి, ప్రభుత్వ న్యాయవాది బొడ్డు ప్రశాంత్ కుమార్, ఉపాధ్యక్షుడు గొంటి శంకర్, సంయుక్త కార్యదర్శి కనికరపు శ్రీనివాస్, కోశాధికారి జెట్టి శేఖర్, మారుముఖం అనిల్ కుమార్, ఒద్యారపు వేణు కుమార్, వడ్లకొండ శ్రీకాంత్, ఉల్లెందుల అనిల్, మహిళా న్యాయవాదులు తమిరి అన్నపూర్ణ, మొగిలి సుజాత, బూర సరిత తదితరులు పాల్గొన్నారు.

## రాంపూర్ పంప్‌హౌస్ నుంచి నీటి విడుదల

మల్యాల, ఆగస్టు 1 (ఈవార్తలు): చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చొరవతో రాంపూర్ పంప్‌హౌస్ ద్వారా వరద కాలువలోకి సాగునీటిని విడుదల చేశారు. దీంతో సాగునీటి సమస్యకు ఉపశమనం లభించిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మల్యాల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో రైతులు, కాంగ్రెస్ నాయకులు గంగమ్మ తల్లికి పూలు, పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించి హారతి సమర్పించారు. సాగునీటి విడుదలకు కృషి చేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా గురుపౌర్ణమి సందర్భంగా కొండగట్టు ఆంజనేయస్వామి ఆశీస్సులతో రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుతూ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీరు అందడం సంతోషకరమని పేర్కొన్నారు. రైతుల అవసరాలకు అనుగుణంగా సాగునీటి సరఫరా కొనసాగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

## రోళ్లవాగుకు షట్టర్లు వెంటనే బిగించాలి

**నిర్లక్ష్యం చేస్తే రైతులు, మత్స్యకారులకు నష్టం.. మాజీ మంత్రి జీవన్‌రెడ్డి**

బీర్పూర్, ఆగస్టు 1 (ఈవార్తలు): రోళ్లవాగు ప్రాజెక్టుకు షట్టర్లను వెంటనే బిగించాలని, పనుల్లో జాప్యం సరికాదని మాజీ మంత్రి టి. జీవన్‌రెడ్డి అన్నారు. శనివారం బీర్పూర్ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్‌తో కలిసి సందర్శించారు. సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ రోళ్లవాగు ప్రాజెక్టు ప్రస్తుత 0.25 టీఎంసీ సామర్థ్యం సరిపోదని, తెలంగాణ ఏర్పడిన తొలినాళ్లలో ప్రాజెక్టు సామర్థ్యాన్ని ఒక టీఎంసీకి పెంచేందుకు కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. దశాబ్దం గడిచినా పనులు పూర్తికాకపోవడం దురదృష్టకరమన్నారు. గత రబీ సీజన్‌లో గేట్లు, షట్టర్లు ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పినా ఇప్పటివరకు అమలు కాలేదని విమర్శించారు. ఇటీవల కురిసిన వర్షాలతో ప్రాజెక్టులో నీరు నిల్వ ఉండి భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉన్నప్పటికీ ఇన్‌స్పెక్షన్ పార్ట్ బ్రీచ్ కావడంతో నీరంతా కిందికి వెళ్లిపోయిందన్నారు. ఇందుకు అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లోపమే కారణమని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బాధ్యత వహించాలని అన్నారు. రోళ్లవాగుకు వెంటనే షట్టర్లు బిగించి రైతులు, మత్స్యకారులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు 24 గంటల విద్యుత్, ఎరువులు సకాలంలో అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. యూరియా బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని, ముందస్తు ప్రణాళిక లేకపోవడం వల్లే సమస్య ఏర్పడిందన్నారు. యూరియాపై ఆంక్షలను తొలగించాలని కోరారు. బీర్పూర్ మండలంలోని పలు గ్రామాల లిఫ్టులు ట్రాన్స్‌ఫార్మర్లు లేక నిలిచిపోయాయని, వాటిని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. దావ వసంత సురేష్ మాట్లాడుతూ రోళ్లవాగు ప్రాజెక్టు ఈ ప్రాంత రైతులకు జీవనాధారమని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో 90 శాతం పనులు పూర్తయ్యాయని, రెండేళ్లుగా ఒక్క షట్టర్ కూడా బిగించలేదని విమర్శించారు. షట్టర్లు ఏర్పాటు చేసి నీటిని నిల్వ చేస్తే రైతులకు రెండు పంటలు పండించే అవకాశం ఉంటుందని, ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తాటిపర్తి సీకే రెడ్డి, కొలుముల రమణ, మసర్తి రమేష్, సుమన్, సుభాష్‌యాదవ్, సత్యంరావు, జితేందర్‌యాదవ్, ముక్క శంకర్, ఆకుల రమేష్, వీరేశ్, ఆకుల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## ధాన్యం బకాయిల కోసం బీజేపీ ఆందోళన

**నిరసనలో బీజేపీ నేత సిరికొండ శ్రీనివాస్‌కు అస్వస్థత**

వేములవాడ టౌన్, ఆగస్టు 1 (ఈవార్తలు): రైతులకు పెండింగ్‌లో ఉన్న ధాన్యం బకాయిలను వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో వేములవాడలో నిర్వహించిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. నిరసన కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్ ఒక్కసారిగా అస్వస్థతకు గురై కుప్పకూలడంతో కలకలం రేగింది. చెక్కపల్లి బస్టాండ్ సమీపంలో ధాన్యాన్ని రహదారిపై పోసి నిరసన తెలుపుతూ బీజేపీ నాయకులు, కార్యకర్తలు తెలంగాణ చౌక్ వద్ద బైఠాయించారు. జిల్లాలో వెలుగుచూసిన ధాన్యం కొనుగోలు అవకతవకల కారణంగా రైతులకు రావాల్సిన బకాయిలు నిలిచిపోయాయని ఆరోపిస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని వెంటనే రైతులకు చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనకు నాయకత్వం వహిస్తున్న సిరికొండ శ్రీనివాస్ అకస్మాత్తుగా అస్వస్థతకు గురై కిందపడిపోవడంతో తోటి నాయకులు వెంటనే ఆయనను వేములవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. రోడ్డుపై నిరసనతో ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో సీఐ వీరప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు రంగంలోకి దిగారు. పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రైతుల హక్కుల కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తుండగా పోలీసులతో అడ్డుకోవడం, అరెస్టులకు పాల్పడడం ప్రజాస్వామ్య విరుద్ధమని బీజేపీ నాయకులు విమర్శించారు. రైతులకు పూర్తి న్యాయం జరిగే వరకు తమ ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



## కూకట్‌పల్లిలో బోనాల చెక్కుల పంపిణీ

కూకట్‌పల్లి, ఆగస్టు 1 (ఈవార్తలు): ఆషాఢ మాస బోనాల పండుగ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి నియోజకవర్గంలోని భరత్‌నగర్ శ్రీ హరిహర క్షేత్ర ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీల ప్రతినిధులకు బోనాల చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్, ఖైత్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కలికోట శంకర్ ముఖ్య అతిథులుగా పాల్గొని ఆలయ కమిటీల ప్రతినిధులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్రంలోని సాంప్రదాయ పండుగలను వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏ, బీ బ్లాక్ అధ్యక్షులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఆసిఫాబాద్‌లో పారిశుద్ధ్య పరిరక్షణే లక్ష్యం

**మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఎండీ అహ్మద్**

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 1 (ఈవార్తలు): ఆసిఫాబాద్ పట్టణంలో పారిశుద్ధ్య పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఎం.డి. అహ్మద్ స్పష్టం చేశారు. పట్టణంలోని 17వ వార్డులో శనివారం మున్సిపల్ ఆధ్వర్యంలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఆయన స్వయంగా పరిశీలించి, పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలోని ప్రధాన డ్రైనేజీల్లో పూడికను తొలగించడంతో పాటు, రోడ్లకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. అనంతరం వైస్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణ నివాసులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా వార్డుల వారీగా పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేస్తున్నామన్నారు. డ్రైనేజీల్లో మురుగు నీరు నిలవకుండా క్రమం తప్పకుండా పూడికతీత పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను మున్సిపల్ వాహనాల్లో వేస్తూ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, వార్డు నాయకులు పాల్గొన్నారు.

# వివాహేతర సంబంధం ఉంటే భరణం రాదు

## సుప్రీంకోర్టు కీలక తీర్పు

న్యూఢిల్లీ: భార్యకు వివాహేతర సంబంధం ఉందంటూ భర్త మోపిన ఆరోపణల్లో నిజానిజాలను ముందే పరిశీలించి.. పూర్తిగా విచారణ జరిపిన తర్వాతే ఆమెకు మధ్యంతర భరణం మంజూరు చేసే అంశంపై న్యాయస్థానాలు నిర్ణయం తీసుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. అలాగే ఆమె నిజంగానే వివాహేతర సంబంధం కొనసాగించినట్లు తెలిస్తే.. ఆమె మధ్యంతర, మలి విడత భరణాలు పొందేందుకు పూర్తిగా అనర్హురాలు అవుతుందని చెప్పింది. అంతేకాకుండా భర్త చేసిన వివాహేతర సంబంధం ఆరోపణపై విచారణను కేసు చివరి దశలో జరుపుతామని క్రింది కోర్టులు చెప్పడం ఎంతమాత్రం సరికాదని జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ విపుల్ ఎం. పంచోలీలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా నేరశిక్షా స్మృతిలోని సెక్షన్ 125(4) నిబంధనలను ధర్మాసనం ప్రస్తావించింది. సదరు చట్టం ప్రకారం భార్యకు వివాహేతర సంబంధం ఉన్నట్లు రుజువు అయితే.. ఆమె మధ్యంతర లేదా మలి విడత భరణం పొందేందుకు పూర్తిగా అనర్హురాలవుతుందని చెప్పింది. భరణంతో పాటు కేసు విచారణకు అయ్యే కోర్టు ఖర్చులను భర్త నుంచి ఇప్పించాలని కోరే హక్కు కూడా ఆమెకు ఉండదని ధర్మాసనం స్పష్టంగా తెలిపింది. చట్టంలోనే ఈ తరహా స్పష్టమైన నిషేధాత్మక నిబంధన ఉన్నందున.. ఆ ఆరోపణపై ముందే విచారణ జరపకుండా భరణం మంజూరు చేయడం సరికాదని న్యాయస్థానం అభిప్రాయపడింది. పుట్టింటికి వెళ్లిపోయిన



భార్యకు మధ్యంతర భరణం మంజూరు చేస్తూ ఉదయ్‌పూర్‌లోని స్పెషల్ అడిషనల్ చీఫ్ మేజిస్ట్రేట్ కోర్టు తీర్పు ఇచ్చింది. అనంతరం ఈ నిర్ణయాన్ని రాజస్థాన్ హైకోర్టు కూడా సమర్థించడంతో బాధితుడైన భర్త సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈక్రమంలోనే కేసు పూర్వాపరాలను పరిశీలించిన ధర్మాసనం.. భార్యపై ఉన్న వివాహేతర సంబంధం ఆరోపణను చివరి దశ విచారణలో చూద్దామంటూ కింది కోర్టులు పేర్కొనడాన్ని తప్పుబట్టింది. ముందుగా ఆ ఆరోపణల నిరూపణపై విచారణ పూర్తి చేసిన తర్వాతే మధ్యంతర భరణంపై న్యాయస్థానాలు ముందుకు వెళ్లాలని పేర్కొంటూ తీర్పు వెలువరించింది. ఈ తీర్పుపై చాలా మంది పురుషులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భార్యలే ప్రాణంగా బతికిన తమను మోసం చేసిన అర్ధాంగిలకు.. తమకు ఇష్టం లేకపోయిన భరణం చెల్లించాల్సి వచ్చేదని, కానీ ఇప్పుడు ఆ ఆరోపణలు నిజమని తేలిస్తే భరణం ఇవ్వకుండా ఉండొచ్చని చెబుతున్నారు. మరి ఈ తీర్పు మీకెలా అనిపిస్తుందో కామెంట్ల రూపంలో వెల్లడించేయండి.



## నాడు ఎమర్జెన్సీకి ఆర్ఎస్ఎస్ మద్దతు

### లేఖలను బయటపెట్టిన జైరాం రమేశ్

న్యూఢిల్లీ: దేశంలో ఇందిరా గాంధీ విధించిన అత్యవసర స్థితి (ఎమర్జెన్సీ)కి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) మద్దతు తెలిపిందన్న తన వాదనను నిరూపించేందుకు కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ రాజ్యసభలో కీలక ఆధారాలను సమర్పించారు. 1975లో నాటి ఆర్ఎస్ఎస్ అధినేత బాలసాహెబ్ దేవరస్ రాసిన మూడు లేఖలను ఆయన శుక్రవారం సభాపతికి అందజేశారు. ఎమర్జెన్సీకి ఆర్ఎస్ఎస్ మద్దతునిచ్చిందనడానికి ఆధారాలు చూపాలని బీజేపీ ఎంపీలు గురువారం విసిరిన సవాలుకు సమాధానంగా జైరాం రమేశ్ ఈ చర్య తీసుకున్నారు. ఈ లేఖలను చారిత్రక ఆధారాలుగా జైరాం రమేశ్ పేర్కొన్నారు. వీటిలో రెండు లేఖలను దేవరస్ నాటి ప్రధాని ఇందిరా గాంధీకి రాయగా, మరొకటి ఆచార్య వినోబా భావేకి రాశారు. 1975 ఆగస్టు 22న ఇందిరా గాంధీకి రాసిన లేఖలో, ఆమె చేసిన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం "సమయోచితంగా, సమతుల్యంగా ఉంది" అని దేవరస్ ప్రశంసించారు. ఆర్ఎస్ఎస్‌పై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని కోరుతూ, దేశాభివృద్ధిలో తమ సంస్థ సేవలను వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 1975 నవంబర్ 10న రాసిన మరో లేఖలో, ఇందిరా గాంధీ ఎన్నిక చెల్లుబాటును సుప్రీంకోర్టు సమర్థించినందుకు ఆమెకు అభినందనలు తెలిపారు. జయప్రకాశ్ నారాయణ్ (జేపీ) ఉద్యమంతో ఆర్ఎస్ఎస్‌కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేస్తూ, సంస్థపై నిషేధాన్ని ఉపసంహరించుకోవాలని మరోసారి కోరారు. ప్రభుత్వ అభివృద్ధి ప్రణాళికల్లో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు భాగస్వాములు అయ్యేలా, ప్రధానికి తమపై ఉన్న అపోహలను తొలగించాలని వినోబా భావేను ఆయన కోరారు.

# రీల్స్‌లోనే క్షమిస్తారా, కేసులు ఎత్తేస్తారా?

## ప్రధాని మోదీ వీడియోపై అభిజీత్ దిప్కే చురక

న్యూఢిల్లీ: నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద.. కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థులు చేపట్టిన నిరసనలు.. తీవ్ర చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. విద్యార్థుల డిమాండ్లకు తలొగ్గిన ధర్మేంద్ర ప్రధాన్.. కేంద్ర విద్యా శాఖ మంత్రి పదవికి రాజీనామా చేయడంతో.. విద్యార్థులు శాంతించారు. అయితే జంతర్ మంతర్ వద్ద నుంచి పార్లమెంటు ముట్టడికి విద్యార్థులు పిలుపునిచ్చిన సమయంలో పోలీసులు, విద్యార్థులకు తీవ్ర వాగ్వాదం, లాఠీఛార్జ్ జరిగింది. ఈ క్రమంలోనే పలువురు విద్యార్థులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇక ప్రధానమంత్రి నరేంద్ర మోదీని దూషిస్తూ.. మరికొందరు విద్యార్థులు వ్యాఖ్యలు చేయగా.. వారిపై కూడా కేసులు పెట్టారు. అయితే ఇటీవల సోషల్ మీడియా వేదికగా సెల్ఫీ వీడియో విడుదల చేసిన ప్రధాని మోదీ.. తనను, తన దివంగత తల్లిని అనుచిత వ్యాఖ్యలు చేసిన విద్యార్థులను క్షమిస్తున్నానని పేర్కొన్నారు. అయితే ఈ వీడియోపై కాక్‌రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే వ్యంగ్యంగా స్పందించారు. ప్రధాని మోదీ రీల్‌లో మాత్రమే క్షమిస్తారా లేక నిరసనకారులపై నమోదైన కేసులను కూడా వెనక్కి తీసుకుంటారా అంటూ ఆ వీడియో కింద కామెంట్ చేశారు. ఇటీవల జంతర్‌మంతర్‌లో జరిగిన విద్యార్థుల ఆందోళనల సందర్భంగా కొందరు ప్రధాని మోదీపై



అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన వీడియోలు వైరల్ కావడంతో దేశవ్యాప్తంగా వివాదం చెలరేగింది. ఈ నేపథ్యంలోనే ఇన్‌స్టాగ్రామ్‌లో విడుదల చేసిన వీడియోలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. తిట్లు, దూషణలు ఏ సమస్యకూ పరిష్కారం కాదని తెలిపారు. అలాంటి యువతను కోర్టుల చుట్టూ తిప్పడం లేదా వేధించడం కంటే వారికి సరైన మార్గనిర్దేశం చేయడమే మంచిదని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే తనను దూషించిన వారిని తాను క్షమిస్తున్నానని.. తప్పుదోవ పట్టిన యువతను సరిదిద్దడం మన బాధ్యత అని చెప్పారు. అయితే.. దీనిపై స్పందించిన అభిజీత్ దిప్కే క్షమాపణ మాటల్లోనే కాకుండా.. నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన కేసులను కూడా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటీవల పేపర్ లీకులు, విద్యా వ్యవస్థలో అక్రమాలపై జరిగిన ఆందోళనల సందర్భంగా అనేక మంది విద్యార్థులపై కేసులు నమోదయ్యాయని ఆయన గుర్తుచేశారు. ఇదిలా ఉండగా, నిరసనల్లో ప్రధాని మోదీపై అసభ్య పదజాలం ఉపయోగించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ బాలికపై నమోదైన జీరో ఎఫ్ఐఆర్ కూడా తీవ్ర వివాదాస్పదం అయింది. ఆ తర్వాత ఆ బాలిక వీడియో విడుదల చేసి తాను కేవలం 15 ఏళ్ల వయస్సు గలదని.. ఇతరుల ప్రభావంతో అలా మాట్లాడానని క్షమాపణ కోరింది. ఈ వ్యవహారంపై కూడా అభిజీత్ దిప్కే స్పందిస్తూ.. ఇలాంటి వ్యాఖ్యలు చేసిన బీజేపీ నేతలు లేదా పార్టీ ఐటీ సెల్ సభ్యులపై ఎప్పుడైనా ఇదే విధంగా కేసులు నమోదు చేశారా అని ప్రశ్నించారు. దేశంలో అందరికీ ఒకే చట్టం అమలు కావాలని.. భావ ప్రకటనా స్వేచ్ఛపై చర్యలు తీసుకునేటప్పుడు సమాన ప్రమాణాలు పాటించాలని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు.. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని, చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. విద్యార్థులపై నమోదైన కేసుల విషయంలో ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు ఉపశమన చర్యలు చేపట్టగా, ఇతర కేసులపై విచారణ కొనసాగుతోంది.

# 14 నెలల రికార్డు స్థాయికి జీఎస్టీ వసూళ్లు

## జులైలో రూ.2.11 లక్షల కోట్లు వసూలు

న్యూఢిల్లీ: దేశంలో ఆర్థిక కార్యకలాపాలు బలంగా కొనసాగుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు జులైలో భారీగా పెరిగాయి. గత ఏడాదితో పోలిస్తే 15.4 శాతం వృద్ధితో రూ.2.11 లక్షల కోట్లకు చేరాయి. గత 14 నెలల్లో నమోదైన అత్యధిక వార్షిక వృద్ధి ఇదేనని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో నెలవారీ జీఎస్టీ వసూళ్లు రూ.2 లక్షల కోట్ల మార్కు దాటడం ఇది రెండోసారి. దేశీయ వినియోగం పెరగడం, వ్యాపార కార్యకలాపాలు పుంజుకోవడమే ఈ వృద్ధికి ప్రధాన కారణాలుగా ప్రభుత్వం పేర్కొంది. గత ఏడాది జులైలో రూ.1.83 లక్షల కోట్లుగా ఉన్న స్థూల జీఎస్టీ వసూళ్లు, ఈసారి రూ.2.11 లక్షల కోట్లకు చేరాయి. దేశీయ జీఎస్టీ ఆదాయం కూడా 10.1 శాతం




పెరిగింది. గత ఏడాది జులైలో రూ.1.31 లక్షల కోట్లుగా ఉన్న ఈ వసూళ్లు, ఈసారి రూ.1.45 లక్షల కోట్లకు పెరిగాయి. దిగుమతులపై జీఎస్టీ వసూళ్లు మరింత వేగంగా పెరిగాయి. 28.8 శాతం వృద్ధితో రూ.66,511 కోట్లకు చేరాయి. దీంతో మొత్తం స్థూల జీఎస్టీ వసూళ్లలో దిగుమతుల వాటా గణనీయంగా పెరిగింది. జులైలో జీఎస్టీ రీఫండ్‌లు కూడా 13.1 శాతం పెరిగి రూ.29,968 కోట్లుగా నమోదయ్యాయి. రీఫండ్‌లను మినహాయించిన తర్వాత నికర జీఎస్టీ ఆదాయం రూ.1.81 లక్షల కోట్లుగా నిలిచింది. ఇది గత ఏడాదితో పోలిస్తే 15.8 శాతం ఎక్కువ. ఇందులో దేశీయ నికర ఆదాయం 10.5 శాతం పెరిగి రూ.1.27 లక్షల కోట్లకు చేరగా, కస్టమ్స్ జీఎస్టీ నుంచి వచ్చిన నికర ఆదాయం 30.3 శాతం పెరిగి రూ.54,223 కోట్లుగా నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లో మొత్తం జీఎస్టీ వసూళ్లు రూ.8.43 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంలో ఇవి రూ.7.66 లక్షల కోట్లుగా ఉన్నాయి. అంటే 10.1 శాతం వృద్ధి నమోదైంది. ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక ప్రకారం, జీఎస్టీతో పాటు ప్రాథమిక ఎక్సైజ్ సుంకంలో రాష్ట్రాల వాటాను పరిగణనలోకి తీసుకుంటే, 2026-27లో రాష్ట్రాలకు గత ఏడాదితో పోలిస్తే సుమారు రూ.1.43 లక్షల కోట్ల అదనపు ప్రయోజనం లభించే అవకాశం ఉంది.

# భారతీయులు 'చెత్త'గా తయారయ్యారు!



## పరిశుభ్రతపై బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు

ముంబై: పరిశుభ్రత విషయంలో భారతీయుల ద్వంద్వ వైఖరిపై బాంబే హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. విదేశాలకు వెళ్లినప్పుడు చెత్తను తప్పనిసరిగా డస్ట్‌బిన్‌లో వేసే వారు, స్వదేశంలో మాత్రం ఎలాంటి సంకోచం లేకుండా రోడ్డుపై పడేస్తున్నారని వ్యాఖ్యానించింది. దీన్ని స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం పేరుతో సమర్థించలేమని స్పష్టం చేసింది. పరిశుభ్రమైన వాతావరణం కోరుకునే ప్రతి పౌరుడిపై సమాజం పట్ల బాధ్యత కూడా ఉంటుందని హితవు పలికింది. ముంబై తూర్పు శివార్లలోని కంజుర్‌మార్గ్ డంపింగ్ యార్డు నుంచి వస్తున్న కాలుష్యం, దుర్వాసన, విషవాయువులు, ఆరోగ్య సమస్యలకు సంబంధించిన పిటిషన్లపై విచారణ సందర్భంగా జస్టిస్ జీఎస్ కులకర్ణి, జస్టిస్ ఆర్తి సాథే ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని తెలిపింది. మరోవైపు పరిశుభ్రత నిబంధనల అమలులో మున్సిపల్ అధికారులు మరింత కఠినంగా వ్యవహరించాలని ఆదేశించింది. "మన దగ్గర చాలామంది ఏమాత్రం ఆలోచించకుండా రోడ్డుపైనే చెత్త పడేస్తారు. కానీ అదే వ్యక్తులు విదేశాల్లో చిన్న చాక్లెట్ కవర్‌ను కూడా డస్ట్‌బిన్‌లోనే వేస్తారు. ఇదేనా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యానికి మూల్యం?" అంటూ ధర్మాసనం ప్రశ్నించింది. పరిశుభ్రమైన వాతావరణం కోరుకునే ప్రతి ఒక్కరూ దాన్ని కాపాడాల్సిన బాధ్యత కూడా తీసుకోవాలని స్పష్టం చేసింది. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేసేవారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించింది. నగరంలోని బీచ్‌లు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతున్నాయని హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ప్రధాన రహదారులు, సందుల్లో చెత్త పేరుకుపోవడం వల్ల ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడుతోందని పేర్కొంది. ఇలాంటి పరిస్థితుల్లో మనం నిజంగా నాగరిక సమాజంలో జీవిస్తున్నామా? అని ప్రశ్నించింది. ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ప్రకటించిన 'స్వచ్ఛ్ ముంబై, సుందర్ ముంబై' లక్ష్యాన్ని ప్రజల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం దెబ్బతీస్తున్నాయని వ్యాఖ్యానించింది. రాజాబాయి టవర్, హైకోర్టు భవనం వంటి వారసత్వ కట్టడాల సమీపంలో చెత్త తరలింపు వాహనాల నిర్వహణపైనా ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. అక్కడికి వచ్చే విదేశీ పర్యాటకులకు రోడ్లపై చెత్త కనిపించడం నగర ప్రతిష్ఠను దెబ్బతీస్తోందని పేర్కొంది. ఈ సమస్యపై వారం రోజుల్లో చర్యలు తీసుకోవాలని మున్సిపల్ సంస్థను ఆదేశించింది. లేకపోతే తగిన ఉత్తర్వులు జారీ చేయాల్సి వస్తుందని హెచ్చరించింది.

# 60,000 మంది వచ్చారు.. 48,000 మంది వెళ్లారు!

## స్పెయిన్‌లోకి వలసదారుల వెల్లువ.. గంటల్లోనే తిరికి మొరాకోకు

లండన్: ఆఫ్రికా-యూరప్ సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మొరాకో నుంచి స్పెయిన్ భూభాగంలోని సెయూటా నగరంలోకి ప్రవేశించేందుకు దాదాపు 60,000 మంది వలసదారులు ఒక్కసారిగా తరలిరావడంతో తీవ్ర గందరగోళం ఏర్పడడం తెలిసిందే. అయితే, స్పెయిన్ భద్రతా దళాల పటిష్ఠ చర్యలు, అక్కడి ప్రతికూల పరిస్థితుల దృష్ట్యా వీరిలో సుమారు 45,000 మంది కొద్ది గంటల్లోనే వెనుదిరిగారు. ఈ ఉద్రిక్తతల క్రమంలో జరిగిన తొక్కిసలాట, నీటిలో మునిగిపోవడం వంటి ప్రమాదాల్లో 67 మంది మృతి చెందారు. సెయూటా సరిహద్దుకు పోటెత్తిన వలసదారులను నిలువరించేందుకు స్పెయిన్ భద్రతా దళాలు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. గుంపును చెదరగొట్టేందుకు బాష్పవాయువు గోళాలు, జల ఫిరంగులను ప్రయోగించడంతో పాటు గాలిలోకి హెచ్చరిక కాల్పులు జరిపారు. సమీపంలోని కొండల పైనుంచి భద్రతా ఏర్పాట్లను గమనించిన వలసదారులు, నగరంలోకి ప్రవేశించడం అసాధ్యమని గ్రహించారు. దీనికి తోడు, అప్పటికే సరిహద్దు దాటిన వారికి సరైన ఆహారం, వసతి లభించడం లేదన్న సమాచారంతో చాలామంది స్వచ్ఛందంగా వెనుదిరిగారు. ఈ ఆకస్మిక వలసల వెనుక కొన్ని కీలక కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. కొద్దిరోజుల క్రితం మొరాకో రాజు చిన్నపాటి నేరాలకు పాల్పడిన వేలమంది ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించారు. అలా విడుదలైన వారి అధిక సంఖ్యలో సరిహద్దు వైపు వచ్చారని పలు కథనాలు వెలువడ్డాయి. మరోవైపు, జూలై నెల ఆరంభంలో సముద్ర మార్గం ద్వారా వచ్చిన వారిని తక్షణం తిప్పి పంపకూడదని స్పెయిన్ కోర్టు ఇచ్చిన తీర్పు కూడా వలసదారులను ప్రభావితం చేసి ఉండవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ తాజా పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. సెయూటాలోని పరిస్థితులు అత్యంత భయానకంగా ఉన్నాయని ఆయన వ్యాఖ్యానించారు. డెమొక్రాట్లు అధికారంలోకి వస్తే అమెరికాలోనూ ఇలాంటి గందరగోళ పరిస్థితులే తలెత్తుతాయని ఆయన హెచ్చరించారు.



# 'కొలీజియం'లో పారదర్శకతలోపం

## సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ఆవేదన

న్యూఢిల్లీ:న్యాయమూర్తులను నియమించే 'కొలీజియం' వ్యవస్థ నిర్ణయాల్లో పారదర్శకత లోపిస్తోందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ఆందోళన వ్యక్తం చేశారు. కొలీజియం తీసుకునే నిర్ణయాల వెనుక గల కారణాలను బహిరంగపరచకపోవడం వల్ల న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం దెబ్బతింటుందని అన్నారు. అర్హత లేని వ్యక్తులు న్యాయవ్యవస్థలోకి ప్రవేశించడానికి దారితీస్తుందని ఆయన హెచ్చరించారు. శనివారం ఢిల్లీలో విధి థింక్-ట్యాంక్ నిర్వహించిన చర్చా కార్యక్రమంలో జస్టిస్ ఉజ్జల్ భుయాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ప్లేటో నుంచి బెంతమ్ వరకు అందరూ చెప్పినట్లు.. కోర్టులలో ఏం జరుగుతోంది? తమ న్యాయమూర్తులు ఎవరు? వారు ఎలాంటి తీర్పులు ఇస్తున్నారు? అని తెలుసుకునే పూర్తి హక్కు దేశ పౌరులకు ఉంది. ఈ సమాచారమంతా ప్రజలకు అందుబాటులో ఉండాలి. 2023లో సౌరభ్ కిర్పాల్‌ను ఢిల్లీ హైకోర్టు జడ్జిగా సిఫార్సు చేసినప్పుడు కొలీజియం చాలా స్పష్టమైన కారణాలను వెల్లడించింది'. 'అయితే0, సౌరభ్ కిర్పాల్‌ను కొలీజియం సిఫార్సు చేసి మూడేళ్లు గడిచినా ఆయన నియామకం ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉంది. కారణాలను వెల్లడించకపోవడం వల్ల సమర్థులైన, నిజాయితీ గల న్యాయమూర్తులకు అన్యాయం జరుగుతుంది. ఎలాంటి అర్హత లేని వ్యక్తులు వ్యవస్థలోకి రావడం వల్ల, వారు భవిష్యత్తులో రాజ్యాంగ విలువలకు విరుద్ధంగా ఒక వర్గం ప్రజలను కించపరిచే వ్యాఖ్యలు చేసే ప్రమాదం ఉంది' అని జస్టిస్ భుయాన్ హెచ్చరించారు.

# స్వేచ్ఛ కాదు.. దేశమే ముందు: అజిత్ దోవల్

పూణె: నీట్ పేపర్ లీక్‌పై జెన్ జీ నిరసనల నేపథ్యంలో జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. స్వాతంత్ర్యం అంటే ఇష్టారీతిన వ్యవహరించగలిగే అపరిమిత స్వేచ్ఛ కాదని అన్నారు. పూణెలో హోంమంత్రి అమిత్ షా చేతుల మీదుగా లోకమాన్య తిలక్ జాతీయ అవార్డు స్వీకరించిన అనంతరం దోవల్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. స్వాతంత్ర పోరాటం నాటి త్యాగాలు, విలువలకు యువత ప్రతిబింబంగా నిలవాలని అన్నారు. వ్యక్తులకు స్వేచ్ఛతో పాటు సమాజం, దేశం విషయంలో బాధ్యతలు కూడా ఉంటాయన్న విషయాన్ని అర్థం చేసుకోవాలని అన్నారు. 'భారత్ గతంలో కూడా ఇలాగే ఉండేదని కొందరు యువత అనుకుంటూ ఉండవచ్చు. లేదా స్వాతంత్ర్యం అంటే ఇష్టారీతిన వ్యవహరించగలిగే అపరిమిత స్వేచ్ఛ అని పొరపాటుపడుతూ ఉండొచ్చు. కానీ స్వాతంత్రం అంటే అది కాదు' అని అన్నారు. ప్రజాస్వామిక స్వేచ్ఛతో పాటు దేశం పట్ల బాధ్యత కూడా కలిగి ఉండాలని సూచించారు. స్వాతంత్ర్య సమర యోధుడు బాల గంగాధర్ తిలక్ జీవితం నుంచి యువత స్ఫూర్తి పొందాలని సూచించారు. 'ఆయన చెప్పిన విషయాల గురించి యువత లోతుగా ఆలోచించాలి. భారత భవిష్యత్తు, జాతి నిర్మాణం గురించి ఆయనకున్న ఆలోచనల గురించి తెలుసుకోవాలి' అని అన్నారు. అవార్డు ప్రదానం సందర్భంగా హోం మంత్రి అమిత్ షా అజిత్ దోవల్‌పై ప్రశంసలు కురిపించారు. భారత విదేశాంగ విధానం, జాతీయ భద్రతా విధానాలను ఆయన బలోపేతం చేశారని అన్నారు. జాతీయ భద్రతకు సంబంధించి ప్రధాని తీసుకునే ప్రతి నిర్ణయం వెనుక దోవల్ పాత్ర, సూచనలు ఉంటాయని అన్నారు. చరిత్రలో దోవల్‌కంటూ ఒక బంగారు పేజీ ఉంటుందని వ్యాఖ్యానించారు.



# ఉత్తరాంధ్రకు 'భోగాపురం' రన్ వే

భోగాపురం, ఆగస్టు 1 (ఈవార్తలు): పవిత్రమైన ఉత్తరాంధ్ర గడ్డపై అడుగుపెట్టడం తనకు ఎంతో గర్వకారణమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం సహా సుమారు రూ.18 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో, తెలుగులో అందరికీ నమస్కారం అంటూ ప్రసంగాన్ని ప్రారంభించారు. సింహాచలం అప్పన్న, పైడితల్లి అమ్మవారికి ప్రణామాలు అర్పించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో, ముఖ్యంగా స్వర్ణాంధ్ర విజన్‌లో ఒక కీలకమైన రోజని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంప్రదాయ నృత్యమైన 'థింసా' ప్రదర్శన తనను మధురానుభూతికి లోనుచేసిందని ప్రధాని తెలిపారు. ఒకేసారి 13 వేల మంది గిరిజన మహిళలు ఈ నృత్యం చేయడం ఒక అద్భుతమని, ఇది ప్రపంచ రికార్డు సృష్టించిందని కొనియాడారు. ఈ నృత్యంలో మన తరతరాల వారసత్వం స్పష్టంగా కనిపించిందని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతను ప్రధాని మోదీ హృదయపూర్వకంగా అభినందించారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఒక కొత్త 'రన్‌వే'గా పనిచేస్తుందని మోదీ ఉద్ఘాటించారు. ఇది ఆంధ్ర యువత ఉజ్వల భవిష్యత్తుకు ఒక 'లాంచ్‌ప్యాడ్' అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో దేశంలో ఎక్కడ విమానాశ్రయం నిర్మించినా ఒకే కుటుంబం పేర్లు కనిపించేవని, కానీ తమ ప్రభుత్వం మహనీయుల పేర్లను పెడుతోందని స్పష్టం చేశారు. "అయోధ్యలో విమానాశ్రయానికి వాల్మీకి మహర్షి పేరు పెట్టాం. పంజాబ్‌లో సంత్ రవిదాస్ పేరుతో ఎయిర్‌పోర్ట్ ప్రారంభించాం. అదేవిధంగా భోగాపురం విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాం" అని ప్రధాని వివరించారు. ఈ ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్‌ను వేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# కీవ్‌లో 9 మంది మృతి

కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా మళ్లీ విరుచుకుపడింది. ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో దాడి చేసింది. శనివారం ఉదయం ఆ అటాక్ జరిగింది. ఆ దాడిలో 9 మంది మృతిచెందగా, 22 మంది గాయపడినట్లు తెలుస్తోంది. సోలోమియానస్కీ జిల్లాలో ఉన్న 5 అంతస్తుల రెసిడెన్షియల్ బిల్డింగ్ దెబ్బతిన్నది. ఆ బిల్డింగ్‌లో ఉన్న 35 మంది తరలించారు. డర్నిస్టికి జిల్లాలో జరిగిన దాడి వల్ల ఏడు మంది మృతిచెందగా, మరో 14 మంది గాయపడ్డారు. అటాక్ వల్ల ఇండ్లు కూలి మంటలు వ్యాపించాయి. ఆ ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోయారు. కీవ్ సమీపంలో ఉన్న మిలిటరీ పారిశ్రామిక కేంద్రాలు, లాజిస్టిక్ హబ్‌లను టార్గెట్ చేసినట్లు రష్యా పేర్కొన్నది. డజన్ల సంఖ్యలో క్షిపణులను వదిలినట్లు రష్యా చెప్పింది. శుక్రవారం రాత్రి హై ప్రిసిషన్ గ్రౌండ్, సీ లాంచ్డ్ వెపన్స్, లాంగ్ రేంజ్ డ్రోన్లతో అటాక్ జరిగినట్లు రష్యా మిలిటరీ శాఖ పేర్కొన్నది. మిస్సైళ్లు, డ్రోన్లు, రేడార్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ ఎక్విప్మెంట్ ఉన్న ప్రొడక్షన్, స్టోరేజీ కేంద్రాలను టార్గెట్ చేసినట్లు రష్యా చెప్పింది.




# నేనూ నీట్ లీక్ బాధితురాలినే

**: మానుషి ఛిల్లార్**

2015లోనే తాను కూడా నీట్ పరీక్ష పేపర్ లీకేజీ బాధితురాలినని మాజీ ప్రపంచ సుందరి, బాలీవుడ్ హీరోయిన్ మానుషి చిల్లర్ వెల్లడించారు. సోహా అలీ ఖాన్ పోడ్‌కాస్ట్‌లో పాల్గొన్న మానుషి చిల్లర్.. 2015లో నీట్ పేపర్ లీక్ అయినప్పుడు తాను ఎదుర్కొన్న మానసిక ఆందోళనలను.. కష్టాల గురించి వెల్లడించారు. పరీక్ష కోసం సిద్ధమవుతున్న సమయంలో తనకు ఎంతో ఇష్టమైన కుచిపూడి నృత్యం, పెయింటింగ్‌లతో పాటు సంతోషాన్నిచ్చే ప్రతి విషయాన్ని దాదాపు ఏడాది పాటు పక్కనబెట్టాల్సి వచ్చిందని చెప్పారు. అలా ఎంతో కష్టపడి పరీక్ష రాసిన తర్వాత... పేపర్ లీక్ కావడంతో మళ్లీ 45 రోజుల పాటు రీ-ఎగ్జామ్ కోసం సిద్ధమవ్వాలని చెప్పినప్పుడు ఆ క్షణం తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని.. అది తన జీవితంలోనే అత్యంత కష్టమైన దశలలో ఒకటని గుర్తుచేసుకున్నారు. అయితే తన కంటే ఎంతోమంది నిరుపేద విద్యార్థులు ఈ లీకేజీల వల్ల నరకం అనుభవించారని మానుషి ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలను కోచింగ్ సెంటర్లకు పంపడానికి తల్లిదండ్రులు స్థోమతకు మించి అప్పులు చేయడం...చిన్న చిన్న పీజీ గదుల్లో ఉంటూ అహోరాత్రులు కష్టపడటం తాను స్వయంగా చూశానని తెలిపారు. తన తల్లిదండ్రులు ఇద్దరూ వైద్యులే కావడంతో తనకు కుటుంబ మద్దతు, మానసిక ధైర్యం లభించాయని.. రోజూ ఒక గంట సేపు వ్యాయామం చేయడం వల్ల తన మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోగలిగానని.. కానీ మిగిలిన పేద విద్యార్థులకు ఆ సౌలభ్యం లేకపోవడం విచారకరమని మానుషి పేర్కొన్నారు. హర్యానాలో జన్మించిన మానుషి చిల్లర్, డాక్టర్ కావాలనే లక్ష్యంతో వైద్య విద్యను అభ్యసిస్తున్న సమయంలోనే మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టారు.



### శార్వరికి డబుల్ ధమాకా

బాలీవుడ్ సెన్సేషనల్ బ్యూటీ, ఆల్ఫా గర్ల్ శార్వరి వాఘ్ ప్రస్తుతం కెరీర్‌లో సూపర్ ఫామ్‌లో దూసుకుపోతోంది. బ్యాక్ టు బ్యాక్ క్రేజీ ప్రాజెక్టులతో బాలీవుడ్‌లో తనదైన ముద్ర వేస్తున్న ఈ భామ, తన అభిమానులకు ఒకేసారి రెండు అదిరిపోయే అప్‌డేట్‌లతో డబుల్ ధమాకా ట్రీట్ ఇచ్చింది. శార్వరి ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్న ఈ రెండు చిత్రాలు తన కెరీర్‌ను మరింత ఎత్తుకు తీసుకెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది. శార్వరి అందించిన మొదటి బిగ్ అప్‌డేట్ తన తదుపరి సినిమా ప్రాజెక్ట్ గురించే! మై వాపస్ ఆవుంగా చిత్రంలో నటుడు వేదాంగ్ రైనాతో కలిసి శార్వరి పండించిన ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీకి ప్రేక్షకులు ఫిదా అయ్యారు. ఈ క్రేజీ పెయిర్ మధ్య ఉన్న అద్భుతమైన కెమిస్ట్రీని చూసి ఇంప్రెస్ అయిన అగ్ర దర్శకుడు ఇంతియాజ్ అలీ.. వీరిద్దరినీ తన తదుపరి రొమాంటిక్ డ్రామాలో కథానాయక-కథానాయకులుగా నటింపజేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. శార్వరి నటనా పటిమపై నమ్మకంతో ఇంతియాజ్ అలీ ఈ సరికొత్త ప్రేమకథను ప్లాన్ చేస్తుండటం శార్వరి ఫ్యాన్స్‌కు పెద్ద శుభవార్తగా మారింది. ఇక శార్వరి అందించిన రెండో ధమాకా అప్‌డేట్.. తను నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం యే ప్రేమ్ మోల్ లియా షూటింగ్ విజయవంతంగా పూర్తికావడం. దర్శక దిగ్గజం సూరజ్ బార్జాత్యా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ మ్యూజికల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో శార్వరి కథానాయికగా నటిస్తోంది. ముంబైలో జరిగిన చివరి రోజు చిత్రీకరణ అనంతరం పంచుకున్న పిక్చర్ పర్ఫెక్ట్ ర్యాప్ ఫోటో-లో సాంప్రదాయ ఎరుపు రంగు చీరలో దేవకన్యలా మెరిసిపోతున్న శార్వరి లుక్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. రాజ్‌శ్రీ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ భారీ చిత్రంలో యంగ్ హీరో ఆయుష్మాన్ ఖురానా సరసన శార్వరి తొలిసారిగా జంటగా నటిస్తోంది. సూరజ్ బార్జాత్యా మార్క్ ఫ్యామిలీ ఎమోషన్స్‌తో పాటు నేటి జెన్-జీ కోణంలో రూపుదిద్దుకుంటున్న ఈ కథలో శార్వరి పాత్ర ఎంతో ప్రాధాన్యతతో కూడుకుని ఉంటుందని సమాచారం. సీనియర్ నటుడు అనుపమ్ ఖేర్ వంటి దిగ్గజాలతో కలిసి శార్వరి స్క్రీన్ షేర్ చేసుకోవడం తన నటనకు దక్కిన పెద్ద గుర్తింపుగా భావించవచ్చు. ఇలా ఒకవైపు ఇంతియాజ్ అలీ లాంటి క్రియేటివ్ డైరెక్టర్‌తో కొత్త రొమాంటిక్ ప్రాజెక్ట్ చర్చలు, మరోవైపు సూరజ్ బార్జాత్యా తెరకెక్కించిన -యే ప్రేమ్ మోల్ లియా మూవీ నవంబర్ 27న విడుదల కానుండటంతో శార్వరి వాఘ్ పేరు బాలీవుడ్‌లో మారుమోగిపోతోంది. ఒకేసారి ఇలాంటి రెండు క్రేజీ సినిమాలతో ముందుకు సాగుతున్న ఈ ఆల్ఫా గర్ల్.. మునుముందు వెండితెరపై మరింత సంచలనం సృష్టించడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు.

# కొరియన్ దెయ్యంతో వరుణ్ ఆటలు

వరుణ్ తేజ్ న్యూ మూవీ కొరియన్ కనకరాజు ట్రైలర్ వచ్చేసింది. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రాజెక్ట్ హారర్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కినట్లు ట్రైలర్ చూస్తే క్లియర్ గా అర్థమవుతోంది. వరుణ్ తేజ్ చాలా కాలం తర్వాత ఒక పూర్తిస్థాయి ఎంటర్టైన్మెంట్ క్యారెక్టర్ లో ఈ సినిమాలో కనిపిస్తున్నాడు. ఆగస్టు 7న థియేటర్లలోకి రాబోతున్న ఈ సినిమా తాలూకు ట్రైలర్ ఆడియన్స్ ను బాగానే ఎంటర్టైన్ చేస్తోంది. ఈ ట్రైలర్ స్టార్టింగ్ లోనే కమెడియన్ సత్య రక్తసిక్త పిశాచ కొరియన్ కనకరాజు దెయ్యం ఆవాహయామి అంటూ దెయ్యాన్ని పిలిచే సీన్ తో అసలు కథ మీద ఆసక్తిని క్రియేట్ చేశారు. పెనుగొండ అనే ఒక పల్లెటూరి బ్యాక్ డ్రాప్ లో జరిగే ఈ కథలో వరుణ్ తేజ్ కనకరాజు అనే మాస్ కుర్రాడిగా ఎంట్రీ ఇచ్చాడు. అయితే ఆ తర్వాత ఊహించని విధంగా ఒక కొరియన్ దెయ్యం అతని ఒంట్లో దూరడం వల్ల వచ్చే కమ్యూనికేషన్ గ్యాప్ తో కథను చాలా ఫన్నీగా డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. దెయ్యం పట్టిన తర్వాత




వరుణ్ తేజ్ అందరితో కొరియన్ భాషలో మాట్లాడుతూ వాళ్లకు పిచ్చెక్కించే సీన్స్ ట్రైలర్ లో బాగా నవ్విస్తాయి. కమ్యూనికేషన్ గ్యాప్ అని ఒక క్యారెక్టర్ చాలా సీరియస్ గా చెప్పే డైలాగ్ ఈ సినిమా అసలు కాన్సెప్ట్ ఏంటో సింపుల్ గా చెబుతుంది. హీరోలో దెయ్యం చేరడం ఆ తరువాత భాష రాకపోవడం అనే పాయింట్ మీద కామెడీ బాగానే వర్కౌట్ అయినట్లు కనిపిస్తోంది. ఈ ట్రైలర్ లో సత్య కామెడీ టైమింగ్ సినిమాకు హైలెట్ అని చెప్పొచ్చు. సత్య చెప్పే డైలాగ్స్ బాగానే వర్కౌట్ అయ్యాయి. అలాగే ఈ పచ్చబొట్టు ఏంది.. నా మీసం ఏది.. జాతర్ల కోడిపుంజుని తయారు చేసినట్టు చేసినారు అని తన కొత్త గెటప్ చూసుకుని వరుణ్ కన్ఫ్యూజ్ అవుతూ చెప్పే మాటలు కూడా ఆడియన్స్ లో ఫన్ జనరేట్ చేస్తున్నాయి. ఇక కేవలం కామెడీ మాత్రమే కాకుండా సెకండ్ హాఫ్ లో మంచి స్టైలిష్ యాక్షన్ కూడా ఉన్నట్లు ట్రైలర్ లో చూపించారు. దెయ్యం పట్టిన తర్వాత ఒక బ్లాక్ సూట్ లో కొరియన్ వీధుల్లో వరుణ్ చేసే యాక్షన్ ఫైట్స్ విజువల్ గా చాలా రిచ్ గా ఉన్నాయి.



# పిల్లలను జాగ్రత్తగా పెంచాలి: కంగనా

జంతర్ మంతర్ వేదికగా జరిగిన నిరసన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి కొందరు అభ్యంతరకర పదజాలం వాడటం దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించి వైరల్‌గా మారిన వీడియోలో తాను కేవలం 15 ఏళ్ల బాలికనని.. నిరసన సమయంలో కొందరి ప్రభావం వల్ల ప్రధానిపై తప్పుగా మాట్లాడానని పేర్కొంటూ క్షమాపణలు చెప్పింది. ఈ వ్యవహారంపై రాజకీయ..సినీ వర్గాల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు రాగా నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ తీవ్రంగా స్పందించారు. ఈ ఉదంతంపై సోషల్ మీడియా వేదికగా కంగన స్పందించారు. సమాజం , తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. టీనేజ్ వయస్సులో ఉన్న యువత ఇలాంటి రాజకీయ ..వివాదాస్పద అంశాల వలలో సులభంగా చిక్కుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.




# ట్రోలర్స్ కు స్ట్రాంగ్ రిప్లై!

కొన్నాళ్లుగా సోషల్ మీడియాకు దూరంగా ఉన్న అనుపమ పరమేశ్వరన్, బ్రేకప్ వార్తల అనంతరం మొదటిసారిగా మీడియా ముందుకు వచ్చారు. 'క్రేజీ కళ్యాణం' ఈవెంట్లో ఆమె ధరించిన వెరైటీ చీరకట్టు, క్యూట్ లుక్స్ అభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇక క్లిష్ట సమయం తర్వాత మునుపటి ఉత్సాహంతో ఈవెంట్‌లో పాల్గొని వేదికపై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈవెంట్‌లో మాట్లాడుతూ అనుపమ తన జీవితంలోని క్లిష్ట పరిస్థితులను, 'బ్యాడ్ డేస్'ను పరోక్షంగా ప్రస్తావించారు. గతంలో ఎన్నో మానసిక ఒత్తిళ్లను ఎదుర్కొన్నానని, అయితే ఇప్పుడు ఆ పరిస్థితులన్నింటినీ అధిగమించి ఎంతో ప్రశాంతంగా, హ్యాపీగా ఉన్నానని తెలిపారు. ఇక తన లైఫ్ ఇకపై ఎవరి కంట్రోల్‌లోనూ ఉండదంటూ ఇటీవలే ఆమె పెట్టిన పోస్టుల వెనుక ఉన్న నిజాన్ని ఈ వ్యాఖ్యలు బలపరిచాయి. ఇటీవల ఆమె ఇన్స్టాగ్రామ్‌లో పెట్టిన వైవిధ్యమైన పోస్టుల గురించి మీడియా ప్రశ్నించగా అనుపమ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. “”నా సోషల్ మీడియా, నా ఇష్టం. నాకు నచ్చిన కంటెంట్‌ను నేను పోస్ట్ చేస్తాను.” ఇక ప్రతీ మహిళ జీవితంలో వచ్చే మార్పులను, ట్రాన్సిషన్‌ను తెలియజెప్పడానికే ఆ పోస్టులు పెట్టాను” అని స్పష్టం చేస్తూ ట్రోలర్ల నోళ్లు మూయించారు.




# తెలంగాణ స్టైల్‌లో 'క్రేజీ కళ్యాణం'

రీసెంట్ గా టైటిల్ పోస్టర్ తో కాస్త బజ్ క్రియేట్ చేసిన 'క్రేజీ కళ్యాణం' సినిమా టీజర్ ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అనుపమ పరమేశ్వరన్, డైరెక్టర్ తరుణ్ భాస్కర్, నరేష్ మెయిన్ లీడ్స్ లో నటిస్తున్న ఈ సినిమాను బద్రప్ప గాజుల డైరెక్ట్ చేస్తున్నారు. పక్కా గ్రామీణ నేపథ్యంలో ఒక పెళ్లి చుట్టూ తిరిగే హంగామాను ఈ టీజర్ లో చాలా ఫన్నీగా ప్రెజెంట్ చేశారు. విలేజ్ లో జరిగే పెళ్లిళ్లు, అక్కడ వచ్చే చిన్న చిన్న గొడవలను బేస్ చేసుకుని ఈ కామెడీ డ్రామాను ప్లాన్ చేసినట్లు విజువల్స్ చూస్తే అర్థమవుతోంది. టీజర్ స్టార్టింగ్ లోనే నరేష్ తన కూతురైన అనుపమ పెళ్లి గురించి ప్లాన్ చేస్తూ “చెప్పు బిడ్డా ఎట్లా చేయాలి నీ పెళ్లి.. ఎంత బంగారం కావాలి.. ఎన్ని చీరలు కావాలన్నా కొనుక్కో.. నీ దోస్తులనందరినీ పిలుచుకో” అంటూ చాలా సరదాగా మాట్లాడే డైలాగ్ తో ఫన్ జర్నీ స్టార్ట్ అవుతుంది. ఆ తర్వాత అనుపమ ఇంగ్లీష్ లో కూడా బాగా మాట్లాడుతుందని నరేష్ చెప్పగా.. “ఓ మై గాడ్ ఓ” అంటూ అనుపమ ఇచ్చే ఎక్స్‌ప్రెషన్ చాలా నాచురల్ గా నవ్విస్తుంది. ఫస్ట్ హాఫ్ లో కాస్త సాఫ్ట్ గా సాగిన ఈ ఫ్యామిలీ కాన్ఫ్లిక్స్, నెక్స్ట్ సీన్స్ లో కంప్లీట్ మాస్ పెళ్లి రచ్చగా మారుతుంది. టీజర్ మధ్యలో వచ్చే క్యారెక్టర్ల గొడవలు, పెళ్లి భోజనాల జరిగే ఫైట్స్ విలేజ్ కల్చర్ ని గుర్తుచేస్తాయి. “ఏ ఫ్యామిలీలు రా నా నాయన.. బతకనీయ్యరు చావనీయ్యరు” అంటూ తెగ ఇబ్బంది పడిపోయే డైలాగ్ నేటి జనరేషన్ కి బాగా కనెక్ట్ అవుతుంది.



# పంత్‌కు ధోనీ ట్రైనింగ్

## శ్రీలంక సిరీస్‌కు ప్రత్యేక శిక్షణ

టీమిండియా స్టార్ వికెట్ కీపర్-బ్యాటర్ రిషబ్ పంత్ త్వరలో శ్రీలంకతో జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కోసం తన సన్నాహకాలను ప్రారంభించాడు. ఇందులో భాగంగా భారత జట్టు మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీతో కలిసి రాంచీలో ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటున్నాడు. వీరిద్దరూ జిమ్‌లో ఉన్న ఫొటోను మాజీ స్పిన్నర్ షాబాజ్ నదీమ్ సోషల్ మీడియాలో పంచుకున్నారు. "భారత క్రికెట్‌లోని ఇద్దరు అత్యుత్తమ ఫినిషర్లు" అంటూ నదీమ్ ఈ ఫొటోకు క్యాప్షన్ పెట్టాడు. ప్రస్తుతం పంత్ భారత వైట్-బాల్ జట్లలో సభ్యుడిగా లేనప్పటికీ, శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలోని టెస్టు జట్టులో మాత్రం కీలక ఆటగాడిగా కొనసాగుతున్నాడు. ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2026లో లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్‌గా పంత్ విఫలమయ్యాడు. ఆ టోర్నీలో 28.36 సగటుతో కేవలం 312 పరుగులు మాత్రమే చేయగా, లక్నో జట్టు పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో నిలిచింది. ఆ జట్టుకు కూడా గుడ్‌బై చెప్పిన పంత్ ఢిల్లీ క్యాపిటల్స్‌లో చేరాడు. ఈ నేపథ్యంలో శ్రీలంక సిరీస్ అతనికి కీలకం కానుంది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో నిలవాలంటే భారత్ రాబోయే 9 టెస్టుల్లో కనీసం 7 గెలవాల్సి ఉంది. ఈ క్రమంలో శ్రీలంకపై 2-0 తేడాతో సిరీస్ గెలవడం చాలా ముఖ్యం. మరోవైపు గాయం కారణంగా ఎంఎస్ ధోనీ ఐపీఎల్ 2026 సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. చెన్నై సూపర్ కింగ్స్ హెడ్ కోచ్‌గా స్టీఫెన్ ఫ్లెమింగ్ వైదొలగడంతో ధోనీ ఆ జట్టుకు మెంటార్‌గా మారే అవకాశాలు ఉన్నాయని వార్తలు వస్తున్నాయి. వరుసగా మూడు సీజన్లలో ప్లేఆఫ్స్ చేరడంలో విఫలమైన సీఎస్కే, జట్టు పునర్వ్యవస్థీకరణపై దృష్టి సారించినట్టు తెలుస్తోంది.




# 4న శ్రీలంకకు టీమిండియా

### ప్రాక్టీస్ మ్యాచ్ షెడ్యూల్ కుదింపు

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27లో కీలకమైన పర్యనటకు సిద్ధమవుతోంది టీమిండియా. రెండు టెస్టుల సిరీస్ కోసం భారత జట్టు ఆగస్టు 4వ తేదీన శ్రీలంక పర్యటనకు వెళ్లనుంది. తొలి టెస్టుకు ముందు శుభ్‌మన్ గిల్ సేన నాలుగు రోజులు ప్రాక్టీస్ మ్యాచ్ ఆడాల్సి ఉంది. అయితే.. అనుకోని కారణాల వల్ల షెడ్యూల్ మారింది. నాలుగు రోజుల కాస్త మూడు రోజులకు మారింది. ఇందుకు కారణం ఏంటనేది మాత్రం తెలియాల్సి ఉంది. శ్రీలంక పర్యటనకు భారత స్క్వాడ్ ప్రకటన సమయంలోనే నాలుగు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ ఉంటుందని బీసీసీఐ తెలిపింది. అయితే.. ఇప్పుడు షెడ్యూల్‌లో మార్పులు చేశామని, ప్రాక్టీస్ మ్యాచ్ మూడు రోజులకే పరిమితం కానుందని సమాచారం. షెడ్యూల్ ఎందుకు మారింది? అనేది మాత్రం తెలియడం లేదు. శుభ్‌మన్ గిల్, కోచ్ గౌతం గంభీర్ బృందం ఆగస్టు 4న శ్రీలంకకు వెళ్లనుంది. మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ అనంతరం తొలి టెస్టుకోసం భారత జట్టు గాలే చేరుకోనుంది. ఆగస్టు 15 వ తేదీన గాలే స్టేడియంలో మొదటి టెస్టు.. ఆపై ఆగస్టు 23న కొలంబోలో రెండో టెస్టులో ఇరుజట్లు తలపడనున్నాయి. ప్రస్తుతం ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ర్యాంకింగ్స్‌లో 5వ స్థానంలో ఉన్న గిల్ సేన.. ఈ రెండు మ్యాచుల్లో గెలిచినా టాప్-2లోకి వచ్చే అవకాశాలు తక్కువే. ఇంగ్లండ్ పర్యటనలో గాయపడిన ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్ పరీక్షలో పాసవ్వడం భారత పేస్ బలాన్ని పెంచనుంది. అయితే.. గాయం నుంచి కోలుకుంటున్న సాయి సుదర్శన్ ఈ టెస్టు సిరీస్‌కు అందుబాటులో ఉంటాడా? లేదా? అనేది తెలియాల్సి ఉంది.

**భారత టెస్టు స్క్వాడ్ :** శుభ్‌మన్ గిల్(కెప్టెన్), కేఎల్ రాహుల్(వైస్ కెప్టెన్), యశస్వీ జైస్వాల్, రిషభ్ పంత్(వికెట్ కీపర్), సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్(వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్, సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, దేవ్‌దత్ పడిక్కల్, సరాన్ష్ జైన్.






# కామన్వెల్త్‌లో ఇండియా జోరు

## పారా షాట్‌పుట్‌లో సోమన్ రాణాకు స్వర్ణం, శుభంకు రజతం.. మహిళల 57 కేజీల బాక్సింగ్‌లో జైస్మిన్‌కు స్వర్ణ పతకం

గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్ 2026లో శనివారం భారత్‌కు చిరస్మరణీయంగా నిలిచింది. పారా అథ్లెటిక్స్, బాక్సింగ్‌లో భారత క్రీడాకారులు అద్భుత ప్రదర్శనతో స్వర్ణ పతకాలు సాధించి త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించారు. పారా షాట్‌పుట్‌లో సోమన్ రాణా స్వర్ణం, శుభం జుయల్ రజత పతకం గెలిచి చరిత్ర సృష్టించగా, బాక్సింగ్‌లో జైస్మిన్ తమ పంచ్ పవర్‌తో పసిడిని ముద్దాడింది. పురుషుల షాట్‌పుట్ ఎఫ్57 విభాగంలో భారత పారా అథ్లెట్లు అసాధారణ ప్రతిభ కనబరిచారు. సోమన్ రాణా స్వర్ణం సాధించగా, శుభం జుయల్ రజత పతకాన్ని గెలుచుకున్నారు. కామన్వెల్త్ గేమ్స్ చరిత్రలో ఈ విభాగంలో భారత్‌కు ఇదే తొలి స్వర్ణ పతకం కాగా, ఒకే ఈవెంట్‌లో స్వర్ణ, రజత పతకాలు (డబుల్ పోడియం) సాధించడం కూడా ఇదే మొదటిసారి. సోమన్ రాణా తన రెండో ప్రయత్నంలో 13.40 మీటర్ల దూరం విసిరి స్వర్ణాన్ని ఖాయం చేసుకున్నాడు. ఆ తర్వాత ఏ అథ్లెట్ కూడా ఈ మార్కును దాటలేకపోయాడు. మరోవైపు, శుభం జుయల్ తన ఆరో, చివరి ప్రయత్నంలో 13.28 మీటర్లు విసిరి అనూహ్యంగా రెండో స్థానానికి దూసుకొచ్చి రజత పతకాన్ని సొంతం చేసుకున్నాడు. కామెరూన్‌కు చెందిన సెడ్రిక్ ఇడ్రిస్ (12.57 మీ) కాంస్యంతో సరిపెట్టుకున్నాడు. ఈ విజయం వెనుక ఇద్దరు అథ్లెట్ల స్ఫూర్తిదాయక ప్రయాణం ఉంది. 2006లో జమ్మూ కాశ్మీర్‌లో ల్యాండ్ మైన్ పేలుడులో తీవ్రంగా గాయపడిన భారత సైనికుడు సోమన్ రాణా, పట్టుదలతో పారా అథ్లెట్‌గా మారి దేశానికి కీర్తి తెచ్చిపెట్టాడు. మరోవైపు, ఆర్మీ అధికారి కావాలనుకున్న శుభం, 2022లో ఒక ప్రమాదంలో కాలు కోల్పోయి, పారా క్రీడల వైపు మళ్లి అతి తక్కువ కాలంలోనే కామన్వెల్త్ పతక విజేతగా నిలిచాడు. మరోవైపు, బాక్సింగ్ లో జైస్మిన్ అద్భుత విజయాన్ని నమోదు చేసి భారత శిబిరంలో ఆనందాన్ని రెట్టింపు చేసింది. జైస్మిన్ మహిళల 57 కేజీల విభాగం ఫైనల్‌లో ఉత్తర ఐర్లాండ్‌కు చెందిన మిచెలా వాల్ష్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. మొదటి రౌండ్ నుంచే పదునైన పంచ్‌లు, అద్భుతమైన ఫుట్‌వర్క్‌తో ప్రత్యర్థిపై విరుచుకుపడింది. మూడు రౌండ్ల పాటు సాగిన ఈ పోరులో జైస్మిన్ 5-0 తేడాతో ఏకగ్రీవ నిర్ణయంతో ఘన విజయం సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఐదుగురు జడ్జీలు ఏకగ్రీవంగా ఆమెకే ఓటు వేయడం ఆమె ఆధిపత్యానికి నిదర్శనం. అంతకుముందు, బాక్సింగ్‌లో భారత క్రీడాకారిణి ప్రీతి పవార్ 54 కిలోల కేటగిరీలో అద్భుత విజయంతో పసిడి పతకం అందుకోవడం తెలిసిందే.

# వివాదంలో జెమీమా రోడ్రిగ్స్




భారత మహిళా క్రికెట్ స్టార్ జెమీమా రోడ్రిగ్స్, పాకిస్థాన్ ఆల్‌రౌండర్ ఫాతిమా సనాతో ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. ఇంగ్లండ్‌లో జరుగుతున్న 'ది హండ్రెడ్' లీగ్‌లో జరిగిన ఓ మ్యాచ్ అనంతరం ఈ దృశ్యం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 2025లో పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి తర్వాత భారత క్రికెటర్లు పాకిస్థాన్ ఆటగాళ్లతో కరచాలనం చేయకూడదని నిర్ణయించుకున్నారు. అప్పటి నుంచి ఈ విధానాన్ని పాటిస్తున్నారు. అయితే, తాజాగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఇరు జట్ల క్రీడాకారులు సంప్రదాయం ప్రకారం ఒకరికొకరు షేక్ హ్యాండ్ ఇచ్చుకున్నారు. ఈ క్రమంలో జెమీమా, ఫాతిమా కరచాలనం చేసుకోవడమే కాకుండా ఒకరినొకరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. అయితే, ఈ అంశంపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వెలువరిస్తున్నారు.

# సెంట్రల్ జోన్ సారథిగా పాటిదార్




ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును వరసగా రెండుసార్లు ఛాంపియన్‌గా నిలిపిన రజత్ పాటిదార్ దేశవాళీ క్రికెట్లో బిజీ కానున్నాడు. త్వరలో మొదలయ్యే దులీప్ ట్రోఫీలో పాటిదార్ సెంట్రల్ జోన్‌ను నడిపించాడు. ఈ ఐపీఎల్ విజేతను కెప్టెన్‌గా 15 మందితో కూడిన స్క్వాడ్‌ను ప్రకటించారు సెలెక్టర్లు. టీ20 చిచ్చరపిడుగు రింకూ సింగ్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. దేశవాళీ సీజన్ 2026-27లో మొదటిదైన దులీప్ ట్రోఫీకి తెరలేవనుంది. ఇప్పటికే ఈస్ట్ జోన్, వెస్ట్ జోన్ తమస్క్వాడ్‌ను ప్రకటించాయి. శనివారం సెంట్రల్ జోన్ సెలెక్టర్లు ఐపీఎల్ విన్నర్ రజత్ పాటిదార్ కెప్టెన్‌గా పటిష్టమైన బృందాన్ని ఎంపిక చేశారు. రింకూ సింగ్‌కు వైస్ కెప్టెన్సీ అప్పగించిన సెలెక్టర్లు.. ఇటీవలే టీ20ల్లో అరంగేట్రం చేసిన యశ్ ఠాకూర్‌ను పేస్ దళంలోకి తీసుకున్నారు. శ్రీలంక పర్యటనకు ఎంపికైన సరాన్ష్ జైన్ ఆల్‌రౌండర్ కోటాలో చోటు దక్కించుకోగా.. వికెట్ కీపర్లుగా ఆర్యన్ జుయల్, కునాల్ సింగ్ రాథోడ్ స్క్వాడ్‌లోకి వచ్చారు. స్పిన్నర్ హర్ష్ దూబే కూడా 15మందిలో స్థానం సంపాదించాడు. జూలై 31న ఉజ్జయిని దేవాలయంలో మహాకాళేశ్వరుడిని కుటుంబం సమేతంగా దర్శించకున్నాడు పాటిదార్. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఆగస్టు 23న దులీప్ ట్రోఫీ మొదలవ్వనుంది. డిఫెండింగ్ ఛాంపియనైన సెంట్రల్ జోన్ నేరుగా సెమీఫైనల్ ఆడనుంది. ఈస్ట్ జోన్, నార్త్ ఈస్ట్ జోన్ మ్యాచ్ విజేతను ఆగస్టు 30న పాటిదార్ సేన ఢీకొట్టనుంది. సెప్టెంబర్ 6వ తేదీన ఫైనల్ జరుగనుంది. సెంట్రల్ జోన్ స్క్వాడ్: రజత్ పాటిదార్(కెప్టెన్), ఆర్యన్ జుయల్(వికెట్ కీపర్), సరాన్ష్ జైన్, అమన్ మొఖడె, కునాల్ ఛండేలా, జీషన్ అన్సారీ, ఆర్యన్ పాండే, అర్షద్ ఖాన్, రింకూ సింగ్(వైస్ కెపట్టన్), ఆయుష్ పాండే, యశ్ రాథోడ్, హర్ష్ దూబే, కునాల్ సింగ్ రాథోడ్(వికెట్ కీపర్), యశ్ ఠాకూర్, నచికెట్ భుటే.

# ఫిఫా ప్రైవేటు పెట్టుబడి ప్లాన్ రద్దు

ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఫుట్‌బాల్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకున్నది. ఫిఫాలో వాటాలను ప్రైవేటు పెట్టుబడిదారులకు అమ్మాలన్న నిర్ణయాన్ని రద్దు చేసినట్లు అధ్యక్షుడు గియాన్ని ఇన్‌ఫాంటినో తెలిపారు. సుమారు 20 శాతం వాటాలను అమ్మి దాదాపు 402 కోట్ల డాలర్లను ఆర్జించాలని ఫిఫా భావించింది. కానీ ప్రణాళికకు ఫుట్‌బాల్ సమాఖ్యల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఫిఫాలోని సభ్య దేశాలు ప్రైవేటు పెట్టుబడులను వ్యతిరేకించాయి. ప్రపంచకప్‌తో పాటు పలు రకాల ఈవెంట్లను ఫిఫా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. వ్యతిరేకత ఎక్కువ కావడం వల్ల వివాదాస్పద ప్లాన్‌ను రద్దు చేస్తున్నట్లు గియాన్ని ఇన్ఫాంటినో తెలిపారు. తాము అనుకున్న ప్రాజెక్టుపై భిన్నాభిప్రాయలు వచ్చాయని, దీంతో విభజన ఏర్పడిందని, తమ లక్ష్యాలు నెరవేరడం లేదు కాబట్టి, ఆ పెట్టుబడి ప్లాన్‌ను రద్దు చేసినట్లు ఫిఫా అధ్యక్షుడు చెప్పారు. ఫిఫాలో మొత్తం 211 సభ్య దేశాలు ఉన్నాయి. అయితే ప్రైవేటు ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్‌కు ఓకే చెబితే ఆయా దేశాలకు 40 మిలియన్ల డాలర్లు ఇస్తామని ఇన్‌ఫాంటినో ఆఫర్ చేశారు. మహిళల, పురుషుల ప్రపంచకపల్లో ప్రైవేటు ఇన్వెస్టర్లకు అవకాశం కల్పించేందుకు ప్లాన్ చేశారు. కానీ యురోపియన్ ఫుట్‌బాల్ సంఘం యూఈఎఫ్ఏ ఆ ప్లాన్‌ను వ్యతిరేకించింది. ఒకవేళ ఆ ప్రణాళిక అమలు చేస్తే తాము వరల్డ్‌కప్‌ను నిషేధిస్తామని అన్నారు.






# జావెలిన్‌లో శ్రీలంక అథ్లెట్‌కు స్వర్ణం

### నీరజ్‌ను వెనక్కినెట్టిన పతిరగే

కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాకు ఊహించని షాక్ తగిలింది. పురుషుల జావెలిన్ త్రో ఫైనల్స్‌లో శ్రీలంకకు చెందిన రుమేశ్ పతిరగే సంచలన ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. పతిరగే 89.75 మీటర్ల దూరం జావెలిన్ విసిరి పసిడిని ముద్దాడగా, నీరజ్ చోప్రా ఈ సీజన్‌లో తన అత్యుత్తమ ప్రదర్శన (85.83 మీటర్లు) చేసినప్పటికీ రజత పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇదే ఈవెంట్‌లో మరో భారత అథ్లెట్ యశ్‌వీర్ సింగ్ 85.41 మీటర్ల త్రోతో కాంస్య పతకం సాధించి, భారత్‌కు డబుల్ పోడియం ఫినిష్ అందించాడు. ఈ సీజన్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్న పతిరగే విజయం క్రీడా విశ్లేషకులను పెద్దగా ఆశ్చర్యపరచలేదు. ఈ ఏడాది రోమ్ డైమండ్ లీగ్‌లో 90 మీటర్ల మార్కును దాటిన తొలి అథ్లెట్‌గా నిలిచిన పతిరగే, 92.62 మీటర్లతో ప్రపంచంలోనే అత్యుత్తమ త్రో నమోదు చేసి ఉన్నాడు. రుమేశ్ పతిరగే ప్రస్థానం ఎంతో ఆసక్తికరమైనది. జావెలిన్ క్రీడలోకి రాకముందు అతను ఒక క్రికెటర్. అండర్-18 కేటగిరీలో శ్రీలంక పేసర్ ఇషాన్ మలింగ తర్వాత గంటకు 134 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేసిన రెండో ఫాస్టెస్ట్ బౌలర్‌గా అతనికి పేరుంది. అయితే, కోచ్ టోనీ ప్రసన్న ప్రోత్సాహంతో జావెలిన్ వైపు మళ్లినట్లు పతిరగే 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపాడు. "నాకు జావెలిన్‌ను పరిచయం చేసింది కోచ్ టోనీనే. ఆయన నాకు క్రీడ గురించే కాదు, జీవితం గురించి కూడా నేర్పించారు" అని పేర్కొన్నాడు. ఈ ఓటమిపై నీరజ్ చోప్రా స్పందిస్తూ.. "విజయానికి ఒక్క మంచి త్రో చాలు. ఈ రోజు అతను ఒక మంచి త్రో వేశాడు. నేను కూడా ఒక మోస్తరు త్రో మాత్రమే వేయగలిగాను" అని అన్నాడు. తిరిగి పోడియంపైకి రావడం సంతోషంగా ఉన్నా, రాబోయే పోటీల్లో మరింత మెరుగవ్వడమే తన లక్ష్యమని నీరజ్ స్పష్టం చేశాడు. గతేడాది ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఏడో స్థానంలో నిలిచిన పతిరగే, ఈ విజయంతో జావెలిన్

ఈవార్తలు
# ప్రజావాణి
ఆదివారం 2-8-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు


నేటి ఈవార్తలు | సంపాదకీయం | Editorial

# ప్రచార రాజకీయాలు.. పాలనకు ప్రత్యామ్నాయమా?

హోర్డింగులు, సోషల్ మీడియా ప్రచారం, అంతర్జాతీయ బ్రాండింగ్ కంటే ప్రజల జీవితాల్లో మార్పే అసలైన విజయ సూచిక. నేటి రాజకీయాల్లో ప్రచారం అనేది పాలనలో ఒక భాగమైంది. ప్రభుత్వాలు తమ విజయాలను ప్రజలకు తెలియజేయడం అవసరమే. పెట్టుబడులను ఆకర్షించాలన్నా, పర్యాటకాన్ని ప్రోత్సహించాలన్నా, రాష్ట్ర ప్రతిష్ఠను పెంచాలన్నా బ్రాండింగ్‌కు ప్రాధాన్యం ఉంది. కానీ ప్రచారమే పాలనగా మారితే, ప్రజా సంక్షేమం వెనుకబడే ప్రమాదం ఉంది. ఏ ప్రభుత్వం అయినా భారీ పెట్టుబడి సదస్సులు, విదేశీ పర్యటనలు, ఒప్పందాలు, ఆధునిక నగరాల విజన్, డిజిటల్ ప్రచారం వంటి కార్యక్రమాలకు పెద్దపీట వేస్తుంది. అయితే ప్రజలు చివరికి అడిగే ప్రశ్న ఒక్కటే--- దీని వల్ల నా జీవితంలో ఏమి మారింది? ఒక రైతుకు పంటకు గిట్టుబాటు ధర దొరికిందా? ఒక నిరుద్యోగ యువకుడికి ఉద్యోగం వచ్చిందా? ఒక మహిళకు భద్రత, ఉపాధి మెరుగుపడిందా? ఒక పేద కుటుంబానికి నాణ్యమైన వైద్యం, విద్య అందుబాటులోకి వచ్చాయా? ఈ ప్రశ్నలకే పాలన సమాధానం చెప్పాలి. ప్రజాస్వామ్యంలో ప్రచారం అవసరమే కానీ, ప్రచారం ఫలితాలను మించకూడదు. ఒక ప్రభుత్వం ఎంతగా ప్రచారం చేసుకుందన్నది చరిత్ర గుర్తుంచుకోదు. ప్రజల జీవితాలను ఎంతగా మార్చిందన్నదే గుర్తుంచుకుంటుంది. అభివృద్ధి అంటే కేవలం పెద్ద ప్రాజెక్టులు కాదు. గ్రామాల్లో తాగునీరు, ప్రభుత్వ పాఠశాలల నాణ్యత, ఆసుపత్రుల్లో వైద్యులు, యువతకు ఉపాధి, రైతుకు ఆదాయం, నగరాల్లో ట్రాఫిక్, పారిశుద్ధ్యం.. ఇవన్నీ కూడా సమానంగా అభివృద్ధి ప్రమాణాలే. నేటి సోషల్ మీడియా యుగంలో ప్రభుత్వాలు తమ విజయాలను క్షణాల్లో ప్రజల ముందుకు తీసుకురాగలుగుతున్నాయి. కానీ అదే సమయంలో ప్రజలు కూడా వాస్తవ పరిస్థితులను వెంటనే ప్రపంచానికి చూపగలుగుతున్నారు. అందుకే ప్రచారం కంటే ఫలితాలే ఎక్కువ కాలం నిలుస్తాయి. ప్రభుత్వం విజయాన్ని ప్రకటనలు నిర్ణయించవు... ప్రజల సంతృప్తి నిర్ణయిస్తుంది. హోర్డింగులపై కనిపించే అభివృద్ధి కాదు, ప్రజల జీవితాల్లో కనిపించే మార్పే నిజమైన సుపరిపాలనకు నిదర్శనం.



# అలసి సొలసిన మనసు

**ఆరోగ్యమే మహాభాగ్యం అని మన సంస్కృతి చెబుతుంది. కానీ ఆరోగ్యం అంటే కేవలం శారీరక ఆరోగ్యమే కాదు; మానసిక ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమైనది. అయినప్పటికీ మన సమాజంలో మానసిక ఆరోగ్యం గురించి మాట్లాడటానికే చాలా మంది సంకోచిస్తారు. "ఏమీ కాదు... ధైర్యంగా ఉండు", "ఇది కూడా ఒక సమస్యేనా?", "మనసు గట్టిగా పెట్టుకో" వంటి మాటలతో సమస్యను చిన్నచూపు చూస్తారు. ఫలితంగా లక్షలాది మంది నిశ్శబ్దంగా ఆందోళన, డిప్రెషన్, ఒత్తిడి, ఒంటరితనం, ఆత్మహత్య ఆలోచనలతో పోరాడుతున్నారు. ఇది వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు; దేశం ఎదుర్కొంటున్న కనిపించని జాతీయ సంక్షోభం.**

ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఎనిమిది మందిలో ఒకరు ఏదో ఒక మానసిక ఆరోగ్య సమస్యతో జీవిస్తున్నారు. భారతదేశం వంటి అత్యధిక జనాభా కలిగిన దేశంలో ఈ సంఖ్య మరింత ఆందోళన కలిగిస్తుంది. దేశంలో కోట్లాది మంది జీవితంలో ఏదో ఒక దశలో మానసిక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని వివిధ అధ్యయనాలు సూచిస్తున్నాయి. భారత ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ మానసిక ఆరోగ్య సర్వే ప్రకారం, దేశంలో పెద్దలలో సుమారు 10-11 శాతం మంది జీవితంలో ఏదో ఒక సమయంలో మానసిక రుగ్మతను ఎదుర్కొనే అవకాశం ఉంది. అంటే కోట్లాది మంది మానసిక ఆరోగ్య సేవలు అవసరమైన పరిస్థితిలో ఉన్నారన్న మాట. కానీ వీరిలో చాలా మందికి చికిత్స అందడం లేదు. దీనినే "ట్రీట్‌మెంట్ గ్యాప" అంటారు. కొన్ని రకాల మానసిక సమస్యల్లో ఈ అంతరం 70-85 శాతం వరకు ఉన్నట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. అంటే చికిత్స అవసరమైన ప్రతి పది మందిలో ఏడుగురు నుంచి ఎనిమిది మంది వరకు వైద్య సేవలు పొందడం లేదు. ఇటీవలి సంవత్సరాల్లో పరిస్థితి మరింత క్లిష్టమైంది. కోవిడ్-19 మహమ్మారి తర్వాత ఒంటరితనం, ఉద్యోగ భద్రతపై ఆందోళనలు, ఆర్థిక ఒత్తిళ్లు, కుటుంబ సమస్యలు, డిజిటల్ వ్యసనం, సోషల్ మీడియా పోలికలు, విద్యా పోటీ, ఉద్యోగ ఒత్తిడి.. ఇవన్నీ కలిసి మానసిక ఆరోగ్య సమస్యలను పెంచాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి వయస్సు వారిలో ఆందోళన, నిద్రలేమి, డిప్రెషన్, భయాందోళనలు పెరుగుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. అత్యంత ఆందోళన కలిగించే విషయం ఆత్మహత్యలు. భారతదేశంలో ప్రతి సంవత్సరం లక్షలాది మంది ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. జాతీయ నేర గణాంకాల బ్యూరో విడుదల చేసే గణాంకాల ప్రకారం, ఇటీవలి సంవత్సరాల్లో ఏటా 1.7 లక్షలకు పైగా ఆత్మహత్యలు నమోదవుతున్నాయి. వీరిలో గణనీయమైన శాతం 18-45 సంవత్సరాల మధ్య వయస్సు వారే. విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు, రోజువారీ వేతన కార్మికులు, చిన్న వ్యాపారులు, ఉద్యోగులు.. సమాజంలోని అన్ని వర్గాల్లో ఈ సమస్య కనిపిస్తోంది.

విద్యార్థుల పరిస్థితి మరింత ఆందోళనకరం. మార్కుల పోటీ, ప్రవేశ పరీక్షల ఒత్తిడి, తల్లిదండ్రుల అంచనాలు, సోషల్ మీడియా ప్రభావం, ఒంటరితనం.. ఇవన్నీ కలిసి యువతలో తీవ్ర మానసిక ఒత్తిడిని సృష్టిస్తున్నాయి. విజయం సాధించాలనే తపన మంచిదే. కానీ "విఫలమైతే జీవితం ముగిసినట్లే" అనే భావన ప్రమాదకరం. ఉద్యోగ రంగంలో కూడా పరిస్థితి భిన్నంగా లేదు. లక్ష్యాలు, గడువులు, పని-వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యత లేకపోవడం, ఉద్యోగ భద్రతపై అనిశ్చితి, నిరంతర డిజిటల్ అనుసంధానం కారణంగా బర్నౌట్ అనే సమస్య వేగంగా పెరుగుతోంది. ఉద్యోగం ఉన్నవారికి పని ఒత్తిడి, ఉద్యోగం లేనివారికి నిరుద్యోగ ఒత్తిడి.. రెండూ మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. వృద్ధుల్లో ఒంటరితనం, జీవిత భాగస్వామిని కోల్పోవడం, ఆరోగ్య సమస్యలు, కుటుంబ వ్యవస్థలో మార్పులు మానసిక సమస్యలకు దారితీస్తున్నాయి. మరోవైపు పిల్లల్లో అధిక స్క్రీన్ టైమ్, డిజిటల్ వ్యసనం, శారీరక ఆటల లోపం, సామాజిక సంబంధాలు తగ్గిపోవడం కూడా మానసిక వికాసాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఈ పరిస్థితికి ప్రధాన అడ్డంకి ముద్ర. మానసిక వైద్యుడిని కలవడం అంటే "పిచ్చి" అనే అపోహ ఇప్పటికీ చాలా చోట్ల ఉంది. ఫలితంగా సమస్య తీవ్రమయ్యే వరకు చికిత్స తీసుకోవడం లేదు. మధుమేహం, రక్తపోటు లాగే డిప్రెషన్, ఆందోళన వంటి సమస్యలు కూడా వైద్యపరంగా చికిత్స చేయగలిగేవే అన్న అవగాహన సమాజంలో పెరగాలి. దేశంలో మానసిక వైద్యుల కొరత కూడా ఒక పెద్ద సవాలు. పట్టణాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో సేవలు మరింత పరిమితంగా ఉన్నాయి. ప్రతి జిల్లా ఆసుపత్రిలో మానసిక ఆరోగ్య విభాగం, శిక్షణ పొందిన మనోవైద్యులు, క్లినికల్ సైకాలజిస్టులు, కౌన్సెలర్లు, సామాజిక కార్యకర్తలు అందుబాటులో ఉండాలి. టెలీ-మెంటల్ హెల్త్ సేవలను మరింత విస్తరించాలి. విద్యా వ్యవస్థలో కూడా మార్పులు అవసరం. పాఠశాలలు, కళాశాలల్లో కౌన్సెలింగ్ సేవలు తప్పనిసరి చేయాలి. మార్కుల కంటే మానసిక స్థైర్యం, భావోద్వేగ నైపుణ్యాలు, ఒత్తిడి నిర్వహణ, జీవిత నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వాలి. ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల్లో కనిపించే హెచ్చరిక సంకేతాలను గుర్తించేలా శిక్షణ పొందాలి.

ఉద్యోగ సంస్థలు తమ ఉద్యోగుల మానసిక ఆరోగ్యాన్ని సంస్థ విజయానికి భాగంగా చూడాలి. గోప్యమైన కౌన్సెలింగ్, పని-వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యతకు అనుకూల విధానాలు, మానసిక ఆరోగ్య సెలవులు వంటి చర్యలు అవసరం. కుటుంబాల పాత్ర అత్యంత కీలకం. పిల్లలు, యువత, వృద్ధులు మాట్లాడే అవకాశాన్ని ఇవ్వాలి. తీర్పు చెప్పకుండా వినాలి. "నువ్వు బలహీనుడు" అని కాకుండా "నీకు మేమున్నాం" అనే నమ్మకాన్ని కల్పించాలి. అనేక సందర్భాల్లో ఒక ఆప్యాయమైన సంభాషణ, ఒక ఆత్మీయ స్పర్శ, ఒక సహాయక మాట కూడా ప్రాణాలను కాపాడగలదు. మీడియా, సోషల్ మీడియా వేదికలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ఆత్మహత్యలను సంచలనంగా కాకుండా, నిరోధక అవగాహన కల్పించే కోణంలో వార్తలు ఇవ్వాలి. మానసిక ఆరోగ్యంపై ఉన్న అపోహలను తొలగించే ప్రచారాలు నిర్వహించాలి. భారతదేశం ప్రపంచంలో అతిపెద్ద యువ జనాభా కలిగిన దేశం. ఆ యువత మానసికంగా ఆరోగ్యంగా ఉంటేనే దేశం ఆర్థికంగా, సామాజికంగా ముందుకు సాగుతుంది. మానసిక ఆరోగ్యం ఒక వ్యక్తి వ్యక్తిగత విషయం కాదు; అది ఉత్పాదకత, విద్య, కుటుంబ స్థిరత్వం, ఆర్థికాభివృద్ధి, జాతీయ పురోగతితో నేరుగా ముడిపడి ఉంది. శరీరంపై కనిపించే గాయాలకు మందు వేస్తాం. కానీ మనసుపై పడిన గాయాలను దాచిపెడతాం. ఇదే మనం మార్చాల్సిన మొదటి ఆలోచన. మానసిక ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం అంటే దేశ భవిష్యత్తునే నిర్లక్ష్యం చేయడం. ప్రతి ఇంట్లో మానసిక ఆరోగ్యం గురించి స్వేచ్ఛగా మాట్లాడే వాతావరణం ఏర్పడినప్పుడే, ప్రతి పాఠశాలలో కౌన్సెలర్ ఉన్నప్పుడే, ప్రతి కార్యాలయంలో మానసిక ఆరోగ్యానికి గౌరవం లభించినప్పుడే, ప్రతి పౌరుడు సహాయం కోరడానికి సంకోచించనప్పుడే.. ఆరోగ్యవంతమైన, సంతోషకరమైన భారతదేశం నిర్మాణం సాధ్యమవుతుంది.



రామస్వామి చింత
అచ్చంపేట (మహబూబ్‌నగర్)

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.